అనకాపల్లి అభివృద్ధి కోసం..
డా॥ సి.యం. రమేష్ గార్కి
ఓటు వేయండి




భూపతిరాజు సత్యనారాయణ

చోడవరం నియోజకవర్గ ప్రొఫైల్	
మండలాలు (చోడవరం, బుచ్చెయ్యపేట, రావికమతం, రోలుగుంట)	4
పంచాయతీలు	110
మొత్తం ఓటర్లు	2,15,396
పురుషులు	1,04,589
మహిళలు	1,10,800
ఇతరులు	7

చోడవరం... ఆది నుంచీ టీడీపీదే ఆధిక్యం

పార్టీ ఆవిర్భావం తరువాత ఇప్పటివరకూ తొమ్మిదిసార్లు ఎన్నికలు


ఆరుసార్లు తెలుగుదేశం విజయం


ఈమని సీతారామశాస్త్రి

- మూడుసార్లు కేఎస్ఎన్‌రాజు వర్సెస్ కరణం ధర్మశ్రీ
- నాలుగోసారి పోటీ పడుతున్న ఆ ఇద్దరు

చారిత్రకంగా ప్రాధాన్యం...రాజకీయంగా చైతన్యం...ఇదీ అనకాపల్లి జిల్లాలోని చోడవరం నియోజకవర్గం ప్రత్యేకత. ఉమ్మడి జిల్లాలో తెలుగుదేశం పార్టీకి గట్టి పట్టున్న నియోజకవర్గాల్లో చోడవరం ముందువరుసలో ఉంటుంది. 1983లో తెలుగుదేశం ఆవిర్భావం తరువాత ఈ నియోజకవర్గంలో తొమ్మిదిసార్లు ఎన్నికలు జరగగా, ఆరుసార్లు ఆ పార్టీ అభ్యర్థులు విజయం సాధించారు. 1983, 1985, 1994 ఎన్నికల్లో గూనూరు ఎర్రునాయుడు, 2004లో గంటా శ్రీనివాసరావు, 2009, 2014లలో కేఎస్ఎన్ఎస్ రాజు తెలుగుదేశం పార్టీ తరపున పోటీ చేసి గెలుపొందారు. 1989, 1999లలో కాంగ్రెస్ తరపున పోటీ చేసిన బలిరెడ్డి సత్యారావు గెలిచారు. ఆయన 1989లో కోట్ల విజయభాస్కర రెడ్డి మంత్రివర్గంలో మధ్య తరహా నీటిపారుదల శాఖా మంత్రిగా పనిచేశారు. గడచిన (2019) ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసిన కరణం ధర్మశ్రీ...టీడీపీ అభ్యర్థి కేఎస్ఎన్ఎస్ రాజుపై విజయం సాధించారు.


కే ఎస్ ఎన్ ఎస్ రాజు


కరణం ధర్మశ్రీ

గత (2019 ఎన్నికల్లో అభ్యర్థులకు వచ్చిన ఓట్లు	
మొత్తం ఓట్లు	2,10,313
పోలైనవి	1,77,219
కరణం ధర్మశ్రీ (వైసీపీ):	93,456
కేఎస్ఎన్ఎస్ రాజు (టీడీపీ):	66,210
పీవీఎస్ఎన్ రాజు (జనసేన):	5,246
గూనూరు వెంకటరావు (కాంగ్రెస్):	1,182
గణపతిరాజు వెంకట అప్పలరాజు (ఇండి)	928
మొల్లి వెంకటరమణ (బీజేపీ)	598
పడవల చక్రవర్తి (ఇండియా ప్రజాబంధు పార్టీ)	315
వంకాయల రామచంద్రరావు (ఇండి)	291
గొలుకొండ శ్రీనివాసరావు (జనజాగృతి)	248
నోటా	5,033


చోడవరం పట్టణం వ్యూ

ఫ్లాష్ బ్యాక్ చోడవరం నియోజకవర్గం

ఇదీ చరిత్ర

చోడవరం ప్రాంతాన్ని పూర్వకాలంలో చోడమల్లాపురంగా పిలిచేవారు. ఈ ప్రాంతాన్ని పాలించిన రాజు ఉపేంద్ర తన తల్లిదండ్రుల పేర్లు కలిసి వచ్చేలా చోడమల్లాపురం అని నామకరణం చేశారు. కాలక్రమంలో చోడమల్లాపురం కాస్తా చోడవరంగా మారిపోయింది. 1947లో చోడవరం నియోజకవర్గం ఏర్పడిన తొలినాళ్లలో ఉత్తరాపల్లి నియోజకవర్గంలో ఉన్న కె.కోటపాడు, కోడూరు, కడిగొట్ల, లక్ష్మీపురం, బుచ్చెయ్యపేట ఫిర్కాలు ఉండేవి. 1978లో నియోజకవర్గాల పునర్విభజనలో కలిగొట్ల ఫిర్కా ఉత్తరాపల్లి నియోజకవర్గంలో చేరిపోగా, కోడూరు, కోటపాడు మాడుగుల ఫిర్కాలో చేరిపోయాయి. తరువాత కాలంలో కె.కోటపాడు ఉత్తరాపల్లి నుంచి మాడుగుల నియోజకవర్గంలో చేరింది. ఇక గొంప నియోజకవర్గంలో ఉన్న రోలుగుంట, రావికమతం ఫిర్కాలు కొత్తగా చోడవరం నియోజకవర్గంలో చేరాయి. చోడవరం నియోజకవర్గ చరిత్ర చూస్తే 1951 నుంచి 2019 వరకూ జరిగిన ఎన్నికల్లో అత్యధికంగా తెలుగుదేశం పార్టీ ఆరుసార్లు విజేతగా నిలిచింది. టీడీపీకి చెందిన గూనూరు ఎర్రునాయుడు (మిలట్రీనాయుడు) మూడుసార్లు ఇక్కడ ఎమ్మెల్యేగా గెలవగా, మాజీ మంత్రి బలిరెడ్డి సత్యారావు, వేచలపు పాలవెల్లి, కేఎస్ఎన్ఎస్ రాజు రెండేసిసార్లు విజయం సాధించారు. మిగిలిన వారంతా ఒక్క దఫాకే పరిమితమయ్యారు.


రెడ్డి జగన్నాథం


పాలవెల్లి

నాలుగోసారి ఇద్దరి మధ్య పోటీ

2009, 2014, 2019 ఎన్నికల్లో కేఎస్ఎన్ఎస్ రాజు, కరణం ధర్మశ్రీ మధ్య ప్రధాన పోటీ జరిగింది. 2009 ఎన్నికల్లో కేఎస్ఎన్ఎస్ రాజు టీడీపీ అభ్యర్థిగా పోటీ చేయగా, ధర్మశ్రీ కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో దిగి రాజు చేతిలో ఓటమిపాలయ్యారు. ఇక 2014 ఎన్నికల్లో టీడీపీ తరపున కేఎస్ఎన్ఎస్ రాజు బరిలో నిలవగా, ధర్మశ్రీ వైసీపీ అభ్యర్థిగా పోటీపడి రెండోసారి రాజు చేతిలో ఓటమిపాలయ్యారు. 2019 ఎన్నికల్లో వైసీపీ తరపున పోటీ చేసిన ధర్మశ్రీ...టీడీపీ అభ్యర్థిగా నిల్చున్న కేఎస్ఎన్ఎస్ రాజుపై విజయం సాధించారు. వచ్చే నెల జరగనున్న ఎన్నికల్లో సైతం వీరిద్దరే ప్రధాన పార్టీల అభ్యర్థులుగా పోటీపడుతుండడం విశేషంగా చెప్పుకోవాలి. దాదాపు దశాబ్దన్నరగా ఈ ఇద్దరు నేతల చుట్టూనే చోడవరం రాజకీయం నడుస్తోంది.

● చోడవరం

ఇప్పటి వరకు గెలిచిన ఎమ్మెల్యేలు

సంవత్సరం	విజేత	పార్టీ	మెజార్టీ	ప్రత్యర్థి
1947-1952	భూపతిరాజు	జాతీయ కాంగ్రెస్ పార్టీ	---	---
1952-1955	కందర్ప రామేశం	కృషికార్‌లోక్ పార్టీ	9,329	భూపతిరాజు సన్యాసిరాజు (కాంగ్రెస్)
1955-1962	రెడ్డి జగన్నాథం	ఇండిపెండెంట్	2,785	బి.జి.నాయుడు (కృషికార్ లోక్‌పార్టీ)
1962-1967	ఇలపకుర్తి సత్యనారాయణ	కాంగ్రెస్	3,440	బి.జి.నాయుడు (ఇండిపెండెంట్)
1967-1972	వేచలపు పాలవెల్లి	స్వతంత్రపార్టీ	15,300	ఇలపకుర్తి సత్యనారాయణ (కాంగ్రెస్)
1972-1978	వేచలపు పాలవెల్లి	కాంగ్రెస్	7,224	బి.సూర్యనారాయణ (ఇండిపెండెంట్)
1978-1983	ఈమని సీతారామశాస్త్రి	జనతాపార్టీ	12,066	వేచలపు పాలవెల్లి (కాంగ్రెస్)
1983-1985	గూనూరు ఎర్రునాయుడు	టీడీపీ	9,282	జి.కన్నంనాయుడు (కాంగ్రెస్)
1985-1989	గూనూరు ఎర్రునాయుడు	టీడీపీ	17,742	జి.కన్నంనాయుడు (కాంగ్రెస్)
1989-1994	బలిరెడ్డి సత్యారావు	కాంగ్రెస్	9,733	గూనూరు ఎర్రునాయుడు (టీడీపీ)
1994-1999	గూనూరు ఎర్రునాయుడు	టీడీపీ	19,076	బలిరెడ్డి సత్యారావు (కాంగ్రెస్)
1999-2004	బలిరెడ్డి సత్యారావు	కాంగ్రెస్	5,518	గూనూరు ఎర్రునాయుడు (టీడీపీ)
2004-2009	గంటా శ్రీనివాసరావు	టీడీపీ	9,616	బలిరెడ్డి సత్యారావు (కాంగ్రెస్)
2009-2014	కె.ఎస్.ఎన్.ఎస్.రాజు	టీడీపీ	1,385	కరణం ధర్మశ్రీ (కాంగ్రెస్)
2014-2019	కె.ఎస్.ఎన్.ఎస్.రాజు	టీడీపీ	612	కరణం ధర్మశ్రీ (వైసీపీ)
2019-2024	కరణం ధర్మశ్రీ	వైసీపీ	27,246	కేఎస్ఎన్ఎస్ రాజు (టీడీపీ)


ఇలపకుర్తి సత్యనారాయణ


బలిరెడ్డి సత్యారావు


గూనూరు ఎర్రునాయుడు


గంటా శ్రీనివాసరావు

పాయకరావుపేట... నియోజకవర్గం

నక్కపల్లిలో ఎన్నికల కేంద్రం

ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో ఏకైక రిజర్వుడ్ నియోజకవర్గం పాయకరావుపేట. దాదాపు ఆరు దశాబ్దాల నుంచి పాయకరావుపేట రిజర్వుడ్ నియోజకవర్గంగా ఉంది. సాధారణంగా సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ ఎక్కడ చూసినా నియోజకవర్గ కేంద్రంలోనే జరుగుతుంది. అయితే ఇక్కడ పేరుకు పాయకరావుపేట నియోజకవర్గ కేంద్రమైనా...ఎన్నికల ప్రక్రియ అంతా నక్కపల్లి కేంద్రంగా జరుగుతుండడం విశేషం.



ఎన్నికల ప్రక్రియ జరిగే నక్కపల్లి తహసీల్దార్ కార్యాలయం

పూర్వం నక్కపల్లి సమితిలో ఎస్.రాయవరం, పాయకరావుపేట, నక్కపల్లి మండలాలు ఉండేవి. అప్పటి నుంచే రాజకీయ వ్యవహారాలు, సభలు నక్కపల్లి కేంద్రంగా జరిగేవి. నక్కపల్లిలోనే పూర్వం నుంచి సబ్ ట్రెజరీ, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉండేవి. తాలూకా కేంద్రంగా అన్ని వర్గాలవారు నక్కపల్లి వచ్చేవారు. జిల్లా రాజకీయాల్లో కూడా పూర్వం నుంచి నక్కపల్లికి చెందిన పలువురు నాయకులు కీలకపాత్ర పోషించేవారు. జాతీయ రహదారికి కేవలం పది అడుగుల దూరంలోనే ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాలతో పాటు మరికొన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఉండేవి. నియోజకవర్గ కేంద్రమైన పాయకరావుపేటలో ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాలు పట్టణానికి దూరంగా ఉండేవి. నక్కపల్లిలో తహసీల్దార్ కార్యాలయ భవనం పూర్వం కూడా విశాలమైన ఉండేది. దాంతో అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి కౌంటింగ్ కేంద్రాన్ని కూడా నక్కపల్లి తహసీల్దార్ (ఎమ్మార్వో) కార్యాలయంలోనే ఏర్పాటుచేసేవారు. అందుకు అవసరమైన సదుపాయాలు ఇక్కడ వుండడంతో నక్కపల్లినే ఎన్నికల కేంద్రంగా ఏర్పాటుచేశారు. రాకపోకలకు అనువుగా ఉంటాయనే ఉద్దేశంతోనే నాటి రాజకీయ పెద్దలు ఎన్నికల కేంద్రాన్ని నక్కపల్లిలోనే ఏర్పాటుచేయాలని కోరడంతో అప్పటి యంత్రాంగం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఆ విధంగా నక్కపల్లిలో నియోజకవర్గం ఎన్నికల కేంద్రం ఏర్పాటైందని చెప్పాలి.

ఇప్పటివరకూ 14సార్లు ఎన్నికలు

1962 నుంచి ఇప్పటివరకూ దాదాపు 14 పర్యాయాలు సార్వత్రిక ఎన్నికలు నియోజకవర్గంలో జరిగాయి. వచ్చే నెలలో మరోమారు ఎన్నికలు జరగనున్నాయి. సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన ప్రతిసారి నక్కపల్లి రెవెన్యూ కార్యాలయంలోనే నియోజకవర్గ ఎన్నికల కేంద్రం ఏర్పాటుచేస్తున్నారు. రాజకీయ పార్టీలతో అధికారులు సమీక్షా సమావేశాలు నక్కపల్లిలోనే జరుగుతుంటాయి. ముఖ్యంగా ఎన్నికల నామినేషన్లు, ఉప సంహరణ, ఈవీఎంల పంపిణీ నక్కపల్లి నుంచే జరుగుతుండడం విశేషం. పేరుకు పాయకరావుపేట నియోజకవర్గంగా వున్న, ఎన్నికల క్రతువంతా నక్కపల్లి కేంద్రంగా జరగడం విశేషం.

● నక్కపల్లి

నచ్చకపోతే నోటా నొక్కొచ్చు..

- 2014 ఎన్నికల్లో 21,991, 2019 ఎన్నికల్లో 55,231 ఓట్లు
- 2014లో చోడవరం నియోజకవర్గంలో గెలుపు, ఓటమిల మధ్య వ్యత్యాసం 909... నోటాకే 931 ఓట్లు

ఓటుకు మన దేశ గతిని మార్చే శక్తి ఉంది. వ్యవస్థ మార్పునకు నాంది పలుకుతుంది. ఒకప్పుడు పోటీలో ఉన్న అభ్యర్థులు ఎవరూ నచ్చకపోయినా ఎవరో ఒకరికి ఓటు వేసి వేయాల్సి వచ్చింది. లేదా ఓటు హక్కు వినియోగించుకోకుండా ఉండాల్సి వచ్చేది. ఇది గతం. ఇప్పుడు అలా కాదు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు 2014 సార్వత్రిక ఎన్నికల్లో మొదటిసారి కేంద్ర ఎన్నికల సంఘం 'నోటా' (నన్ ఆఫ్ ద అబౌ)ను ఓటర్లకు అందుబాటులోకి తెచ్చింది. పోటీలో ఉన్న అభ్యర్థులు ఎవరూ నచ్చకపోతే 'నోటా'కు ఓటు వేసుకోవచ్చు. ఓటింగ్ యంత్రంపై అభ్యర్థులు, వారి పేర్లు, గుర్తులతో పాటు వరుస సంఖ్యలో చివర్లో 'నోటా' పేరిట ఓ గుర్తు ఉంటుంది. ఈ నోటా వల్ల కొన్ని పర్యాయాలు అభ్యర్థుల జాతకాలు తారుమారు అయిపోతున్నాయి. ఓటు వేయకుండా ఇంట్లో కూర్చోవడం సరైన నిర్ణయం కాదు. ఓటు హక్కు తప్పనిసరిగ్గా వినియోగించుకోవాలి. పోలైన ఓట్లలో 20 శాతం, అంతకంటే ఎక్కువ ఓట్లు నోటాకు పోలైతే అభ్యర్థులను ఎన్నికల సంఘం పోటీకి అనర్హులుగా ప్రకటిస్తుంది. ఆ ఎన్నికలను నిలిపివేస్తుంది. తిరిగి ఎన్నికలు నిర్వహించేందుకు తేదీలను ప్రకటిస్తే నూతన అభ్యర్థులు (ముందు అనర్హులుగా ప్రకటించినవారు కాకుండా) బరిలో నిలవాల్సి ఉంటుంది.

ఉమ్మడి విశాఖ జిల్లాలోని 15 నియోజకవర్గాల్లో 2019 ఎన్నికల్లో నోటాకు 55,231 ఓట్లు పోలయ్యాయి. ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు ఎవరూ నచ్చనప్పుడు ఓటరు తన అభిప్రాయం తెలపడానికి వీలుగా ఎన్నికల సంఘం 'నోటా'ను ప్రవేశపెట్టింది. ప్రతి ఎన్నికల్లో నోటాకు వేసినవారు పెరుగుతూనే ఉన్నారు. ఒక్కొక్క నియోజకవర్గంలో ప్రధానపార్టీ అభ్యర్థులకు వచ్చే ఓట్లు కంటే నోటాకే అధికంగా పడుతున్నాయి. అభ్యర్థులు నచ్చక ఓటు వేస్తున్నారో లేక తెలియక నోటాకు నొక్కుతున్నారో గానీ నోటాకు భారీగానే నమోదవుతున్నాయి.

2019 సార్వత్రిక ఎన్నికల్లో భీమిలి నియోజకవర్గంలో నోటాకు 4,263 ఓట్లు పోలయ్యాయి. ఇక్కడ ప్రధాన పార్టీలైన బీజేపీ అభ్యర్థి కోరాడ అప్పారావుకు 2,468, కాంగ్రెస్ అభ్యర్థి తెడ్డు రామదాసుకు 1,880 కంటే నోటాకే అధికంగా పడ్డాయి. అలాగే విశాఖ తూర్పులో నోటాకు 1,741 ఓట్లు పడగా...కాంగ్రెస్ అభ్యర్థి వజ్జిపర్తి శ్రీనివాసరావుకు 1,663 ఓట్లు వచ్చాయి. అలాగే చోడవరం నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి గూనురు వెంకట్రావుకు 1,188, బీజేపీ అభ్యర్థి మొల్లి వెంకటరమణకు 625 ఓట్లు పడితే నోటాకు 5,036 వచ్చాయి. అలాగే మాడుగుల నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి బొడ్డు శ్రీనివాస్‌కు 1657, బీజేపి అభ్యర్థి సుబ్బలక్ష్మికి 796, జనసేన అభ్యర్థి గవిరెడ్డి సన్యాసినాయుడుకు 3,745 ఓట్లు రాగా, నోటాకు 4,672 వచ్చాయి. అలాగే అరకులోయలో గతం కంటే నోటాకు అధికంగా నమోదయ్యాయి. బీజేపీ, కాంగ్రెస్, ఇతర అభ్యర్థుల కంటే నోటాకే 10,177 ఓట్లు పోలయ్యాయి. పాడేరులో బీజేపీ అభ్యర్థి లోకుల్ గాంధీకి 4,631, కాంగ్రెస్ అభ్యర్థి వంతల సుబ్బారావుకు 4,910, జనసేన అభ్యర్థి పసుపులేటి బాలరాజుకు 6,038 ఓట్లు రాగా, నోటాకు 7,808 ఓట్లు పడ్డాయి. అలాగే పెందుర్తి, పాయరావుపేట నియోజకవర్గాల్లో బీజేపీ, కాంగ్రెస్, ఇతర ఇండిపెండెంట్ల కంటే నోటాకే అధికంగా ఓట్లు పడ్డాయి.



2014, 2019 అసెంబ్లీ ఎన్నికల్లో నియోజకవర్గాల వారీగా 'నోటా'కు వచ్చిన ఓట్లు...

నియోజకవర్గం	నోటాకు వేసిన ఓట్లు 2014	నోటాకు వేసిన ఓట్లు 2019
భీమిలి	2,468	4,263
విశాఖ తీర్పు	1,042	1,741
విశాఖ దక్షిణ	1,032	1,208
విశాఖ ఉత్తర	1,440	1,401
విశాక పశ్చిమ	1,119	1,561
గాజువాక	1,103	1,764
చోడవరం	931	5,036
వి.మాడుగుల	946	4,672
అరుకులోయ	4,933	10,177
పాడేరు	2,828	7,808
అనకాపల్లి	774	2,558
పెందుర్తి	1,150	3,737
ఎలమంచిలి	631	2,963
పాయకరావుపేట	900	5,189
నర్సీపట్నం	694	1,143
మొత్తం	21,991	55,231



నోటా టెన్షన్

నోటాను ఈవీఎంలలో చేర్చడంతో అభ్యర్థుల్లో టెన్షన్ మొదలైంది. బరిలో ఉన్న అభ్యర్థుల్లో ఎవరూ నచ్చకుంటే నోటాకు ఓటు వేయవచ్చు. గతంలో జరిగిన ఎన్నికల్లో నోటాకు భారీగానే పడుతుండడంతో అభ్యర్థుల్లో టెన్షన్ మొదలైంది. వృద్ధులు, నిరక్షరాస్యులు నోటా కూడా ఓ అభ్యర్థి గుర్తు అనుకుని ఓటు వేసే ప్రమాదం లేకపోలేదనే చర్చ జరుగుతుంది.

రీ ఎలక్షనే...

నోటా గురించి చాలా మంది సామాన్య ప్రజల్లో కొన్ని అపోహలు కూడా లేకపోలేదు. ఏ అభ్యర్థినీ కాదని నోటాకు ఓటు వేసినప్పుడు, అభ్యర్థులందరి కంటే నోటాకే ఎక్కువ ఓట్లు వచ్చినా కూడా నోటాతో సంబంధం లేకుండా ఓట్లు ఏ అభ్యర్థికి ఎక్కువ వస్తే వారు గెలిచినట్టు అనుకుంటూ ఉంటారు. ఇది పొరపాటు. ఒక నియోజకవర్గంలో అభ్యర్థులందరి కంటే నోటాకే ఎక్కువ ఓట్లు వస్తే ఆ నియెజకవర్గంలో ఏ అభ్యర్థీ గెలిచినట్టు కాదు. తిరిగి ఎన్నికలు నిర్వహించాల్సిందే. ఈ రీ ఎలక్షన్‌లో ఇంతకు ముందు పోటీ చేసిన ఏ అభ్యర్థికీ పోటీ చేయడానికి అర్హత ఉండదు. తాజాగా నిర్వహించిన ఎన్నికల్లో ఏ అభ్యర్థికి 50 శాతానికి మించి ఓట్లు వస్తాయో ఆ అభ్యర్థి గెలిచినట్టు ప్రకటిస్తారు.

● రోలుగుంట



విద్యావంతులకు ప్రాధాన్యమివ్వాలి



చట్టసభలకు విద్యావంతులను ఎన్నుకోవాలి. వారు విజ్ఞతతో వ్యవహరించి సభలో ప్రజాసమస్యలపై గళమెత్తగలరు. విద్య, వైద్యం, ఉపాధి లభించేలా ప్రభుత్వాన్ని ఒప్పించగలుగుతారు. స్వలాభం కోసం రాజకీయాల్లోకి వచ్చిన వారిని ఎన్నుకుంటే వారి ఆస్తులను మాత్రమే పెంచుకుంటారు. ప్రజా సమస్యలను పట్టించుకోరు. అన్ని వర్గాల వారిని సమదృష్టితో చూసే వారినే ప్రతినిధులుగా ఎన్నుకోవాలి.

- పాంగి మత్స్యకొండబాబు, అరకు

పంపకాలు కాదు అభివృద్ధి కావాలి



రాష్ట్ర ఖజానాను ఖాళీ చేసి ప్రజలకు పంచుకుంటూ పోతే అభివృద్ధి ఎలా సాధ్యమవుతుంది. పరిశ్రమలు, మౌలిక వసతులు, యువతకు ఉపాధి అవకాశాలపై ప్రభుత్వం దృష్టిపెట్టాలి. ఇలాంటి ఆలోచనలున్న అభ్యర్థిని చట్టసభలకు పంపాలి. ఆర్థిక నేరగాళ్లు, క్రిమినల్స్ రాజకీయాల్లోకి రాకుండా ఓటర్లే అడ్డుకోవాలి. అలా అయితేనే పార్టీలు వారికి టికెట్లు ఇచ్చేందుకు భయపడతాయి. ఓటర్లు ఆలోచించాలి.

- ఆర్ఎల్ఎన్ శాస్త్రి, విశ్రాంత బ్యాంకు ఉద్యోగి, గోపాలపట్నం

పనిచేసే సామర్థ్యం ఉండాలి



స్థానిక సమస్యల పరిష్కారం కోసం పని చేసే సామర్థ్యం ఉన్న నేతను ఎన్నిక చేసుకోవాలి. చిత్తశుద్ధి, పట్టుదల, ఇచ్చిన మాట నిలబెట్టుకునే గుణం వంటి నాయకులను ఎన్నుకుంటే మంచి జరుగుతుంది. చట్టాలపై అవగాహన ఉన్న వారు ప్రజా ప్రతినిధి అయితే సమస్యలు పరిష్కరించే సత్తా ఉంటుంది. ఇలాంటి వారిని ఎంపిక చేయాలి. ఎన్నికల తరువాత కూడా ప్రజల్లో ఉండే నాయకుడితోనే మేలు.

- దుప్పల కేశవరావు, ఉక్కు విశ్రాంత ఉద్యోగి, గాజువాక

చట్టసభల గౌరవాన్ని నిలబెట్టాలి



ఎన్నికయ్యే ప్రజాప్రతినిధులు చట్టసభల గౌరవాన్ని నిలబెట్టగలగాలి. స్వప్రయోజనాల కోసం గెలవాలనుకునే వారిని ఓటుద్వారా తిరస్కరిద్దాం. అన్నివర్గాల ప్రజా సమస్యలను గుర్తించి, పరిష్కరించగలిగే వారికే మద్దతు పలకాలి. ఉచితాలతో మేలు జరగదు. పరిశ్రమలు, అభివృద్ధి చేపట్టి యువతకు ఉపాధి కల్పిస్తేనే భవిష్యత్తు. అలాంటి వారిని గుర్తించి ఓటు వేయాలి.

- స్వర్ణశైలజ, రచయిత్రి, మురళీనగర్

మీరూ పంపించండి

ఎన్నికల వేడి మొదలయ్యింది. పార్టీలు, అభ్యర్థులు సమరాంగణానికి సిద్ధమవుతున్నారు. ఎటువంటి వారు అధికారంలోకి రావాలని మీరు కోరుకుంటున్నారు? పాలకులు ఎలా ఉండాలనుకుం టున్నారు?, ఏం చేయాలని కోరుకుంటున్నారు? ...అభిప్రాయం ఏదైనా మీ మనసులో మాట మాతో పంచుకోండి. దాన్ని 'ఆంధ్రజ్యోతి' పాఠకుల ముందుంచుతాం. ఇంకెందుకు ఆలస్యం మీ అభిప్రాయాన్ని, ఫోటోతో సహా ఈ నంబరుకు వాట్సాప్ చేయండి.

వాట్సాప్ నంబర్ ... 9848212243



జన కేతనం
చోడవరం... ఆది నుంచీ టీడీపీ ఆధిక్యం
నచ్చకపోతే 'నోటా' నొక్కొచ్చు
నక్కపల్లిలో ఎన్నికల కేంద్రం
- 4లో



నిర్మానుష్యంగా ఉన్న పరవాడ ప్రధాన రహదారి

రారెత్తించిన ఎండలు

- చీడికాడ, దేవరాపల్లిలో 44.1 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదు

అనకాపల్లి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎండలు రారెత్తిస్తున్నాయి. జిల్లాలో చీడికాడ, దేవరాపల్లిలో మంగళవారం 44.1 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మాకవరపాలెం 43.8, రావికమతంలో 43.4, గొలుగొండ 43, కశింకోట 42.8, మాడుగుల 42.6, కె.కోటపాడు 42.5, చోడవరం 42.4, అనకాపల్లి 41.9, కోటవురట్ల 41.6, రోలుగుంట 41.6, బుచ్చెయ్యపేట 41.3, నర్సీపట్నం 41.1, సబ్బవరం 41.1, నాతవరం 40.7, అచ్యుతాపురం 39.5, ఎస్.రాయవరం 39.4, పరవాడ, ఎలమంచిలి, పాయకరావుపేట 39.3, మునగపాక 38.1, నక్కపల్లి 38, రాంబిల్లి 36.5 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఎండ తీవ్రతకు జనం అల్లాడిపోయారు. మధ్యాహ్నం వేళ రహదారులు నిర్మానుష్యంగా కనిపించాయి.

పరవాడలో..

పరవాడ: పరవాడ, పరిసర ప్రాంతాల్లో మంగళవారం 40.1 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఎండ తీవ్రత కొనసాగింది. ఎండకు తోడు వడగాడ్పులు వీయడంతో ప్రజలు అల్లాడిపోయారు. ఎండ ధాటికి పరవాడ మంగళవారపు సంత బోసిపోయింది. ఉదయం పది గంటలకే ప్రధాన రహదారులన్నీ నిర్మానుష్యంగా కనిపించాయి.

ఆంధ్రజ్యోతి
ఆంధ్రజ్యోతి దినపత్రికలో అన్ని రకాల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు,
9985411639
ఆంధ్రజ్యోతి దినపత్రిక చందాదారులుగా చేరాలన్నా, పత్రిక సరఫరాలో ఎలాంటి సమస్యలు ఉన్నా ఈ నెంబరుకు సంప్రదించగలరు.
9985411029

బస్సు ప్రయాణికులకు మళ్లీ కష్టాలు

సీఎం సభకు అనకాపల్లి నుంచి 50 బస్సులు తరలింపు

- బస్సులు లేక నరకయాతన
- గంటల తరబడి బస్ కాంప్లెక్స్‌లో నిరీక్షణ
- వడగాడ్పులు, ఉక్కపోతతో జనం అవస్థలు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 23: అనకాపల్లి ప్రజా రవాణా శాఖ (పీటీడీ) కాంప్లెక్స్‌లో మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు ప్రయాణికులు నరకయాతన అనుభవించారు. విజయనగరంలో మంగళవారం సాయంత్రం జరిగే సీఎం జగన్మోహన్‌రెడ్డి సభకు అనకాపల్లి డిపో నుంచి ఉదయం ఏడు గంటలకే 50 బస్సులను పంపించారు. దీంతో బస్సులు అందుబాటులో లేక బస్ కాంప్లెక్స్‌లో ప్రయాణికులు పడి గాపులు కాశారు. ఓ వైపు వడగాడ్పులు, మరో వైపు ఉక్కపోతతో అల్లాడి పోయారు. సీఎం సభ జరిగే ప్రతీసారి బస్సులను తరలించడంతో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.



అనకాపల్లి బస్ కాంప్లెక్స్‌లో వేచి ఉన్న ప్రయాణికులు

అనకాపల్లి డిపోలో ఉన్న వంద బస్సుల్లో 65 బస్సులు మాత్రమే సంస్థకు చెందినవి కాగా, మిగిలిన 35 బస్సులు అద్దెవి. అద్దె బస్సులను ఇతర కార్యక్రమాలకు పంపించడానికి అవకాశం లేకపోవడంతో సంస్థ పరిధిలో ఉన్న 65 బస్సుల్లో 50 బస్సులను విజయనగరంలో జరిగే సీఎం సభకు తరలించారు.

అనకాపల్లి నుంచి ఈ బస్సులు విజయనగరం జిల్లా ఎస్.కోట నియోజకవర్గం నుంచి విజయనగరం సభకు ప్రజలను తరలించడానికి పంపించారు. దీని వల్ల అనకాపల్లిలో ప్రయాణికులకు బస్సుల కొరత తప్పలేదు.

విశాఖపట్నం, విజయనగరం, పలాస, రావికమతం, చోడవరం తదితర ప్రాంతాలకు వెళ్లాల్సిన బస్సుల్లో చాలా వరకు కోత విధించి విజయనగరం సభకు తరలించారు. అంతేకాకుండా అనకాపల్లి డిపో నుంచి అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు, పెదబయలు, ముంచంగిపుట్టు, జోలాపుట్టుకు వెళ్లే సర్వీసులను కూడా రద్దు చేయడంతో జిల్లా కేంద్రమైన అనకాపల్లి నుంచి అల్లూరి సీతారామరాజు జిల్లాలోని వివిధ ప్రాంతాలకు వెళ్లాల్సిన ప్రయాణికులకు అవస్థలు తప్పలేదు. వీరంతా ప్రైవేటు వాహనాల్లో చోడవరం వెళ్లి అక్కడ అందుబాటులో ఉన్న బస్సులు లేదా ప్రైవేటు వాహనాల్లో ఏజెన్సీ ప్రాంతానికి వెళ్లాల్సి వచ్చింది. గంటల తరబడి డిపోలో బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు విసుగు చెంది ప్రైవేటు వాహనాల్లో గమ్యస్థానాలకు చేరాల్సిన పరిస్థితి నెలకొంది. సీఎం పర్యటన, సభ జరిగే ప్రతీసారి పీటీడీ అధికారులు బస్సులను కేటాయించడంతో ప్రయాణికులు తరచూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బుధవారం శ్రీకాకుళం జిల్లాలో జరిగే సీఎం సభకు కూడా అనకాపల్లి డిపో నుంచి బస్సులను కేటాయించినట్టు తెలిసింది.

గంటల కొద్దీ నిరీక్షణ



అనకాపల్లి నుంచి చోడవరంలోని ఒక శుభకార్యానికి వెళ్లేందుకు ఉదయం 11 గంటలకు కాంప్లెక్స్‌కు వచ్చాం. గంట సేపు ఎదురు చూసినా ఒక్క బస్సు కూడా రాలేదు. అధికారులను అడిగితే మధ్యాహ్నం 12.30 గంటలకు బస్సు వస్తుందని చెప్పారు. అయితే అప్పటికీ రాలేదు. బస్సులు లేకపోవడంతో చాలా అవస్థలు పడ్డాం.

- కె.లోకేశ్, అనకాపల్లి

నేడు కేంద్ర రక్షణ మంత్రి రాక

- సీఎం రమేశ్ నామినేషన్ కార్యక్రమానికి హాజరు



కేంద్ర రక్షణ మంత్రి భద్రత ఏర్పాట్లపై డీఎస్పీతో చర్చిస్తున్న ఎన్ఎస్‌జీ డీఎస్పీ రాకేశ్‌కుమార్

అనకాపల్లి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): కేంద్ర రక్షణ శాఖా మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ బుధవారం అనకాపల్లి రానున్నారు. అనకాపల్లి పార్లమెంట్ స్థానం నుంచి కూటమి తరఫున బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సీఎం రమేశ్ ఉదయం 11.15 గంటలకు కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ రవి పట్టన్‌శెట్టికి నామినేషన్ అందజేయనున్నారు. అనంతరం స్థానిక సుంకరమెట్ట జంక్షన్ నుంచి పెరుగు బజారు మీదుగా నెహ్రూచౌక్ వరకు భారీ ర్యాలీ నిర్వహించనున్నారు. నెహ్రూచౌక్ కూడలిలో నిర్వహించే బహిరంగ సభకు రాజ్‌నాథ్‌సింగ్ హాజరై ప్రసంగించనున్నారు.

కేంద్ర రక్షణ మంత్రి భద్రతా ఏర్పాట్ల పరిశీలన

అనకాపల్లి టౌన్: అనకాపల్లికి బుధవారం కేంద్ర రక్షణ శాఖా మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ రానున్న నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లను ఎన్ఎస్‌జీ డీఎస్పీ సి.రాకేశ్‌కుమార్ మంగళవారం పరిశీలించారు. పట్టణంలో రోడ్డు షో, నెహ్రూచౌక్‌లో నిర్వహించే బహిరంగసభ ఏర్పాట్లను ఆయన బృందం పరిశీలించింది. రోడ్డు షో ప్రారంభమయ్యే సుంకరమెట్ట జంక్షన్ నుంచి నెహ్రూచౌక్ వరకు క్షుణ్ణంగా పరిశీలించి అనకాపల్లి డీఎస్పీ అప్పలరాజుకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌జీ బృందంతో పాటు అనకాపల్లి పట్టణ సీఐ జి.శంకరరావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న నామినేషన్ల పర్వం

- పార్లమెంట్‌కు ఒకటి, అసెంబ్లీకి 13 నామినేషన్లు

అనకాపల్లి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నామినేషన్ల పర్వం కొనసాగుతోంది. జిల్లాలో మంగళవారం పార్లమెంట్ స్థానానికి ఒకటి, అసెంబ్లీ సెగ్మెంట్‌లకు 13 నామినేషన్లు దాఖలయ్యాయి. అనకాపల్లి పార్లమెంట్ స్థానానికి పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా తరఫున కర్రి విజయలక్ష్మి తన నామినేషన్ పత్రాలను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టికి అందజేశారు. చోడవరం అసెంబ్లీ స్థానానికి కాంగ్రెస్ నుంచి జగత శ్రీనివాసరావు, మాడుగుల స్థానానికి టీడీపీ అభ్యర్థి బండారు సత్యనారాయణమూర్తి మరో సెట్టును రిటర్నింగ్ అధికారికి అందజేశారు. అనకాపల్లి అసెంబ్లీ స్థానానికి జయభారత్ నేషనల్ పార్టీ నుంచి కనిశెట్టి సురేశ్‌బాబు, కాంగ్రెస్ నుంచి ఇల్లా రామగంగాధరరావు, అదే పార్టీ నుంచి అవినాశ్ ఇల్లా నామినేషన్లు దాఖలు చేశారు. అనకాపల్లి అసెంబ్లీకి స్వతంత్ర అభ్యర్థిగా వీవీ రామచంద్రరావు, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా తరఫున పొలమరశెట్టి అంబికాదేవి నామినేషన్ పత్రాలను ఆర్వోకు అందజేశారు. ఎలమంచిలి అసెంబ్లీకి జనసేన తరఫున సుందరపు రవికుమార్, కాంగ్రెస్ నుంచి తనకాల అనంతరామనర్సింగరావు నామినేషన్లు దాఖలు చేశారు. పాయకరావుపేట అసెంబ్లీ స్థానానికి టీడీపీ అభ్యర్థి వంగలపూడి అనిత, స్వతంత్ర అభ్యర్థి ఏసయ్య బూర్తి నామినేషన్లు వేశారు. నర్సీపట్నం నుంచి వైసీపీ అభ్యర్థి పెట్ల ఉమాశంకర్ గణేశ్ మరో సెట్టు, అదే పార్టీ నుంచి పెట్ల కళావతి, అలాగే స్వతంత్ర అభ్యర్థి బయ్యపురెడ్డి భద్రాచలం నామినేషన్లు దాఖలు చేశారు.

అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమా!

బూడి ముత్యాలనాయుడుకి సీఎం రమేశ్ సవాల్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రమేశ్

కొత్తూరు, ఏప్రిల్ 23: జిల్లా అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమా అని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడుకు బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్ సవాల్ విసిరారు. అనకాపల్లి పార్టీ కార్యాలయంలో ఆయన మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం నుంచి ఎన్ని సంక్షేమ పథకాలు వస్తున్నాయి?, ఎన్ని ప్రజలకు చేరవేశారనే అంశాలపై చర్చించేందుకు తాను సిద్ధంగా ఉన్నానన్నారు. సొంత గ్రామమైన మాడుగులనే అభివృద్ధి చేయలేని బూడి ముత్యాలనాయుడు అనకాపల్లి పార్లమెంటుకు వెళ్లి ఏం అభివృద్ధి చేస్తారని ప్రశ్నించారు. కూటమి తరఫున తానొక్కడినే వస్తానని, వైసీపీ నుంచి ఎంపీ అభ్యర్థి ముత్యాలనాయుడు, ఏడుగురు ఎమ్మెల్యే అభ్యర్థులు వస్తే బహిరంగంగా డిబేట్ పెట్టుకుందామని సవాల్ విసిరారు. సీఎం రమేశ్‌కు ఢిల్లీలోని వీధులు తెలుసా? అని బూడి ముత్యాలనాయుడు సోమవారం నామినేషన్ వేస్తూ ప్రశ్నించడాన్ని ఆయన ఖండించారు. ఢిల్లీలో రాజకీయాల గురించి, పార్లమెంటు గురించి తెలుసునని మీడియాతో మాట్లాడానే గానీ ఢిల్లీలో వీధుల గురించి తెలుసుకోవాల్సిన అవసరం తనకు లేదన్నారు. ముత్యాలనాయుడు, ఆ పార్టీ ఏడుగురు అసెంబ్లీ అభ్యర్థులు వస్తే అనకాపల్లి పార్లమెంటు పరిధిలో ఎన్ని మండలాలు ఉన్నాయి?, ఎన్ని గ్రామాలు ఉన్నాయి?, ఓటర్లు ఎంత మంది ఉన్నారో చర్చించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని తెలిపారు. ఈ ప్రాంతంపై ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి ఏమైనా గౌరవం ఉందా? అని ఆయన ప్రశ్నించారు. ఇటీవల అనకాపల్లి నియోజకవర్గంలోని కశింకోట మండలం చింతలపాలెం గ్రామంలో జరిగిన సిద్ధం సభలో ఎమ్మెల్యే అభ్యర్థి భరత్‌కుమార్‌తో మాట్లాడించారే గాని, ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడుతో మాట్లాడించకపోవడం సిగ్గుచేటన్నారు. అంటే ఎంపీ అభ్యర్థిని మార్చే ఆలోచనలో అధిష్ఠానం ఉందా? అని ప్రశ్నించారు. ఈ సమావేశంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, బీజేపీ నాయకులు పరుచూరి భాస్కరరావు, శ్రీనివాసులునాయుడు పాల్గొన్నారు.

జగన్ రోడ్‌షో వెలవెల

విశాఖలో మలిరోజు పర్యటనలోనూ అదే సీన్

- బస్సు యాత్రకు కనిపించని స్పందన
- పీఎంపాలెం క్రికెట్ స్టేడియం వద్ద కొద్దిమంది జనం
- వారంతా ఆటోల్లో తీసుకువచ్చినవారే
- ఆ తర్వాత జనం లేకపోవడంతో బస్సులోకి వెళ్లి కూర్చున్న జగన్
- రోడ్డుపక్కన ఉన్న ఇద్దరు, ముగ్గురికీ నమస్కారం చేసుకుంటూ ముందుకు...



విశాఖ నగర పరిధిలోని మధురవాడ చంద్రంపాలెంలో జగన్ బస్సు యాత్ర

విశాఖపట్నం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత 'మేమంతా సిద్ధం' పేరుతో జిల్లాలో నిర్వహిస్తున్న బస్సు యాత్రకు మంగళవారం కూడా ప్రజల నుంచి స్పందన కరువైంది. విశాఖ పరిధిలో ఆదివారం రోడ్‌షో నిర్వహించిన ఆయన..సోమవారం యాత్రకు విరామం ప్రకటించారు. 21వ రోజు యాత్రలో భాగంగా మంగళవారం ఉదయం 10.30 గంటలకు ఎండాడలోని ఎంవీవీ సిటీ వెనుక బస చేసిన ప్రాంతం నుంచి బస్సు యాత్రను జగన్ ప్రారంభించారు. అప్పటికే ఆరు, ఏడు, ఎనిమిది వార్డుల నుంచి ఆటోల్లో తరలించిన జనాలను నాయకులు పీఎం పాలెం క్రికెట్ స్టేడియం వద్ద జాతీయ రహదారి పక్కన నిలబెట్టి ఉంచారు. ఉదయం ఎనిమిది గంటలకే వారందరినీ అక్కడకు తీసుకువచ్చారు. తొమ్మిది నుంచి ఎండ తీవ్రంగా ఉండడంతో వారంతా విలవిల్లాడిపోయారు. సీఎం జగన్ బస్సుపై నిలబడి వారందరికీ అభివాదం/నమస్కారం చేసుకుంటూ ముందుకుసాగారు. అయితే స్టేడియం దాటేసరికి ఒక్కరు కూడా రోడ్డు మీద లేకపోవడంతో జగన్ బస్సుపై నుంచి దిగి లోపల కూర్చున్నారు. అక్కడి నుంచి రోడ్డుపక్కన నిలబడి చూస్తున్న వారికి నమస్కారం చేసుకుంటూ వెళ్లిపోయారు. మధురవాడ, కొమ్మాది, పరదేశిపాలెం, బోయిపాలెం జంక్షన్ల వద్ద కొద్ది సంఖ్యలో మాత్రమే జనం కనిపించడంతో వారికి బస్సులో నుంచే జగన్ నమస్కారం చేశారు. ఆనందపురం జంక్షన్‌లో కూడా పెద్దగా జనం లేరు. పూలమార్కెట్ వద్ద కొంతమంది ఉండడంతో సీఎం జగన్ మళ్లీ బస్సుపైకి వారికి నమస్కారం చేసుకుంటూ ముందుకువెళ్లి తర్వాత బస్సులోకి వెళ్లి కూర్చుండిపోయారు. అనంతరం అక్కడకు కొద్దిదూరంలో ఉన్న చెన్నా కన్వెన్షన్ సెంటర్‌కు వెళ్లి వైసీపీ సోషల్ మీడియా విభాగం వలంటీర్లతో సమావేశమయ్యారు. మధ్యాహ్నం భోజనం విరామం తర్వాత విజయనగరం బయలుదేరి వెళ్లారు.

నిత్యం ట్రాఫిక్ అవస్థలు

- కొత్తూరు జంక్షన్‌లో నత్తనడకన రహదారి నిర్మాణ పనులు
- తరచూ నిలిచిపోతున్న వాహనాలు



కొత్తూరు జంక్షన్‌లో రహదారి నిర్మాణ పనులు జరుగుతుండడంతో నిలిచిపోయిన వాహనాలు

చోడవరం, ఏప్రిల్ 23: పట్టణంలోని కొత్తూరు జంక్షన్‌లో బీఎన్ రోడ్డు నిర్మాణ పనులు నత్తనడకన సాగుతుండడంతో తరచూ ట్రాఫిక్ స్తంభిస్తోంది. దీంతో వాహనచోదకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటి వరకు ఎగసిపడే దుమ్మూ ధూళితో బాధపడు తున్న వాహనచోదకులు ప్రస్తుతం ట్రాఫిక్ సమస్యతో సతమత మవుతున్నారు. తాజాగా మెయిన్ రోడ్డు నిర్మా ణ పనులు చేపట్టగా, కొన్ని చోట్ల తారు రోడ్డు పనులు చేస్తుండగా కొత్తూరు జంక్షన్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నారు. అయితే సీసీ రోడ్డు నిర్మాణ పనులు నత్తనడకన సాగుతుండడం, రోడ్డు పనుల కోసం బారికేడ్లు తొలగించకపోవడంతో ఈ మార్గంలో త రచూ వాహనాలు నిలిచిపోతున్నాయి. దీంతో వాహన చోదకులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అసలే రద్దీగా ఉండే కొత్తూరు జంక్షన్‌లో వాహనాలు ప్రతీ అర్ధగంటకు నిలిచిపోతుండడంతో అవస్థలు తప్పడం లేదు. ఇప్పటి కైనా అధికారులు స్పందించి ఈ రహదారి నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని వాహనచోదకులు కోరు తున్నారు.

వలంటీర్ల బరితెగింపు

యథేచ్ఛగా వైసీపీ ప్రచార కార్యక్రమాలకు హాజరు

- తాజాగా సీఎం జగన్‌తో జరిగిన సోషల్ మీడియా సమావేశంలో ఇద్దరు హల్‌చల్

ఎస్.రాయవరం, ఏప్రిల్ 23: మండలంలోని పలువురు వలంటీర్లు బరితెగిస్తున్నారు. తమ విధులను సైతం పక్కన పెట్టి బహిరంగంగానే వైసీపీ ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. మండలంలోని కొత్త రేవుపోలవరం, ఉప్పరాపల్లి గ్రామ సచివాలయాలకు చెందిన వలంటీర్లు చేపల రాజు, నానేపల్లి అప్పలరాజు వైసీపీ ప్రచార కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. వీరు వలంటీర్లుగానే కాకుండా వైసీపీకి చెందిన సోషల్ మీడియాలో కూడా కొనసాగుతున్నారు. దీనిలో భాగంగా మంగళవారం విశాఖలో సీఎం జగన్‌తో జరిగిన సోషల్ మీడియా ప్రతినిధుల సమావేశంలో వలంటీర్లు రాజు, అప్పలరాజు పాల్గొని సందడి చేశారు. వీరి తీరుపై ప్రతిపక్షాలకు చెందిన పలువురు నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వారిపై చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కోరుతున్నారు. దీనిపై ఎంపీడీవో సత్యనారాయణమూర్తి వివరణ కోరగా వలంటీర్లుగా విధులు నిర్వహిస్తూ రాజకీయ పార్టీలకు చెందిన ప్రచార కార్యక్రమాల్లో ఎవరైనా పాల్గొన్నట్టు తెలిస్తే వారిపై వెంటనే చర్యలు తీసుకుంటామని, వారిని విధుల నుంచి తొలగిస్తామని చెప్పారు.



విశాఖలో ముఖ్యమంత్రి జగన్‌తో మంగళవారం జరిగిన సోషల్ మీడియా సమావేశంలో పాల్గొన్న వలంటీర్లు చేపల రాజు, నానేపల్లి అప్పలరాజు(వృత్తంలో ఉన్నవారు)

విశాఖ-చెన్నై వీక్లీ స్పెషల్‌కు ఎలమంచిలిలో హాల్ట్

ఎలమంచిలి, ఏప్రిల్ 23: ఈనెల 27వ తేదీ నుంచి ప్రారంభమయ్యే విశాఖ, చెన్నై వీక్లీ సమ్మర్ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ రైలుకు ఎలమంచిలిలో హాల్ట్ ఇచ్చినట్టు రైల్వే అధికారులు తెలిపారు. ప్రత్యేక ఎక్స్‌ప్రెస్‌కు ఎలమంచిలిలో హాల్ట్ ఇవ్వడం పట్ల ఎలమంచిలి ప్యాసింజర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధి సత్యనారాయణ, ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

సీఎం రమేశ్ నామినేషన్‌కు తరలిరావాలి

ఎలమంచిలి, ఏప్రిల్ 23: అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం.రమేశ్ నామినేషన్ కార్యక్రమానికి కూటమి శ్రేణులంతా తరలిరావాలని టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొర్లె నానాజీ పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ సీఎం రమేశ్ నామినేషన్ కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించేలా ఏర్పాట్లు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నేతలు బొద్దపు శ్రీను, గుర్రాల శేఖర్, కొఠారు నరేష్, పల్లా సత్యనారాయణ, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబరు గుర్రాల నగేష్ పాల్గొన్నారు.

ఘనంగా చోడమాంబిక ఉత్సవం

అచ్యుతాపురం రూరల్, ఏప్రిల్ 23: మండలంలోని చోడపల్లిలో చోడమాంబిక అమ్మవారి పండుగ మంగళవారం ఘనంగా నిర్వహించారు. వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కోలాటాల ప్రదర్శన, చిడతలు, గంగిరెద్దు సేవ వంటి సంప్రదాయ కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

యువకుడి ఆత్మహత్య

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 23: ఆర్థిక ఇబ్బందులు తాళలేక మంగళవారం తెల్లవారుజామున ఉరిపోసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటనపై అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పట్టణ ఎస్ఐ వి. సత్యనారాయణ తెలిపారు. ఆయన అందించిన వివరాలిలా ఉన్నాయి. తాకాశివీధికి ఆనుకుని ఉన్న కుమ్మరివీధికి చెందిన కొత్తూరు రమణబాబు (35) ఎన్టీఆర్ జంక్షన్ సమీపంలోని సెల్‌ఫోన్ దుకాణం నిర్వహిస్తున్నాడు. రోజు మాదిరిగానే సోమవారం రాత్రి ఇంటికి వెళ్లి నిద్రపోయాడు. మంగళవారం వేకువజామున మూడు గంటల సమయంలో నిద్ర నుంచి మేల్కొని తనకు చాలా అప్పులు ఉన్నాయని, వడ్డీలు కట్టలేకపోతున్నానని మనస్తాపంతో ఆత్మహత్య చేసుకుంటున్నట్టు సెల్ఫీ వీడియో తీసి భార్యకు, స్నేహితులకు పంపాడు. అనంతరం ఇంట్లోంచి బయటకు వచ్చి సమీపంలోని మహానందేశ్వర ఆలయం పిల్లర్‌కు నైలాన్‌తాడుతో ఉరిపోసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఉదయం గుడి వచ్చిన కె.శ్రీను అనే వ్యక్తి సంఘటనను చూసి కుటుంబసభ్యులకు తెలియపరిచారు. భార్య గంగాభవాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. రమణబాబుకు భార్య కుమార్తె, కుమారుడు ఉన్నారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

ఎలమంచిలి, ఏప్రిల్ 23: మండలంలోని రేగుపాలెం జంక్షన్ వద్ద హైవేపై రోడ్డు దాటుతున్న వ్యక్తిని లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందినట్టు రూరల్ ఎస్ఐ సింహాచలం తెలిపారు. మంగళవారం రాత్రి జరిగిన ఈ ప్రమాదంలో నాతవరం మండలం జిల్లేడిపూడి గ్రామానికి చెందిన ఐతి సత్తిబాబు మృతి చెందారన్నారు. అనకాపల్లి నుంచి తుని వైపు ప్రయాణిస్తున్న లారీ జంక్షన్ వద్ద సత్తిబాబు రోడ్డు దాటుతుండగా ఢీకొందన్నారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించామని ఎస్ఐ సింహాచలం తెలిపారు.

మండల టాపర్‌కు అభినందన

ఎస్.రాయవరం, ఏప్రిల్ 23: పదో తరగతి ఫలితాల్లో మండలంలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో టాపర్లుగా నిలిచిన, దార్లపూడి జడ్పీ హైస్కూల్ విద్యార్థి శివశంకర్ వరప్రసాద్ (579), వెంకట పవన్‌సాయి (574)లను మంగళవారం ప్రధానోపాధ్యాయిని రమణశ్రీ, ఉపాధ్యాయులు అభినందించారు.



కూటమి అభ్యర్థులను గెలిపించాలి

మూడు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించిన జనసేన అభ్యర్థి సుందరపు విజయకుమార్


రజాలలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి విజయకుమార్

రాంబిల్లి, ఏప్రిల్ 23 : సార్వత్రిక ఎన్నికల్లో జనసేన ఎమ్మెల్యే, అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థులను గెలిపించాలని జనసేన ఎలమంచిలి ఎమ్మెల్యే అభ్యర్థి సుందరపు విజయకుమార్ ఓటర్లను అభ్యర్థించారు. మంగళవారం ఆయన జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి మండలంలోని రజాల, కుమ్మరాపల్లి, కట్టుబోలు గ్రామాల్లో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని ఉపాధి వేతనదారులతో మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రజలు అన్ని విధాల నష్టపోయారన్నారు. వైసీపీ ప్రభుత్వం సంక్షేమం పేరుతో రూపాయి ఇచ్చి వంద రూపాయలు కాజేసిందని విమర్శించారు. ఈ ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో కూలి పనులు కూడా దొరకని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఐదేళ్లలో ప్రజలను నిలువ దోపిడీ చేసిన వైసీపీకి వచ్చే ఎన్నికల్లో ఓటుతో సరైన గుణపాఠం చెప్పాలని ఆయన కోరారు. వచ్చేది ఎన్డీయే కూటమి ప్రభుత్వమేనని, ప్రజలకు అంతా మేలే జరుగుతుందన్నారు. ప్రజలు కుటుంబాలతో సంతోషంగా జీవించే పరిస్థితి వస్తుందన్నారు. తనకు గాజుగ్లాసు గుర్తుపైన, ఎంపీ అభ్యర్థి సీఎం రమేశ్‌కు కమలం గుర్తుపైన ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని విజయకుమార్ ఓటర్ల అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు వి.దినబాబు, పప్పల నూకన్నదొర, కారే రాముడు, డీఎస్ఎన్‌రాజు(బుజ్జి), కరణం శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి చెందాలంటే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావాలి

టీడీపీ పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను.. పాయకరావుపేటలో ఇంటింటా ప్రచారం


బృందావనంలో ప్రచారం నిర్వహిస్తున్న కూటమి నాయకులు

పాయకరావుపేట, ఏప్రిల్ 23 : వైసీపీ పాలనలో కనీస అభివృద్ధికి నోచుకోని రాష్ట్రాన్ని గాడిలో పెట్టాలంటే వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని టీడీపీ పట్టణ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను అన్నారు. మంగళవారం టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు పట్టణంలోని బృందావనం తదితర ప్రాంతాల్లో ఇంటింటా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా టీడీపీ సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి సీఎం.రమేశ్‌కు కమలం గుర్తుపైన, ఎమ్మెల్యే అభ్యర్థిని వంగలపూడి అనితకు సైకిల్ గుర్తుపైన ఓట్లు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు చింతకాయల రాంబాబు, పల్లా విలియంకేరి, లెక్కల గోవిందు, జూరెడ్డి ప్రసాద్, వేములపూడి అప్పారావు, గుల్లా నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

23ఎన్‌కేపీ3: టీడీపీ అభ్యర్థిని అనిత తరపున నామినేషన్ పత్రాలను అందజేస్తున్న లాలం కాశీనాయుడు

పేటలో మరో 2 నామినేషన్లు

నక్కపల్లి: పాయకరావుపేట అసెంబ్లీ సెగ్మెంట్‌కు సంబంధించి మంగళవారం రెండు నామినేషన్లు దాఖలయ్యాయి. టీడీపీ అభ్యర్థిని వంగలపూడి అనిత తరపున మరో సెట్ నామినేషన్ దాఖలు చేశారు. ఆమె తరపున టీడీపీ నాయకుడు లాలం కాశీనాయుడు, తదితరులు ఆర్వో కె.గీతాంజలికి నామినేషన్ పత్రాలు అందజేశారు. అలాగే నక్కపల్లి మండలం దేవవరం గ్రామానికి చెందిన భూర్తి ఏసు ఇండిపెండెంట్‌గా నామినేషన్ దాఖలు చేశారు. దీంతో ఇప్పటి వరకూ పాయకరావుపేట నియోజకవర్గానికి సంబంధించి 7 నామినేషన్లు దాఖలయ్యాయి.

సీఎం రమేశ్ నామినేషన్‌కు తరలిరండి : బత్తుల


సమావేశంలో మాట్లాడుతున్న తాతయ్యబాబు

తుమ్మపాల(అనకాపల్లి), ఏప్రిల్ 23: అనకాపల్లి బీజేపీ పార్లమెంటు అభ్యర్థి సీఎం రమేశ్ నామినేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగజగదీశ్వరరావు కోరారు. మంగళవారం జిల్లా పార్టీ కార్యాలయంలో టీడీపీ శ్రేణులతో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. బుధవారం సీఎం రమేశ్ నామినేషన్ దాఖలు చేయనున్నారన్నారు. సాయంత్రం సుంకరమెట్టజంక్షన్ నుంచి నెహ్రూచౌక్ వరకు భారీ ర్యాలీని నిర్వహించనున్నామన్నారు. నారా చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోట్ని బాలాజీ, ధనాల విష్ణుచౌదరి, కుప్పిలి జగన్, మళ్ల గణేష్, కర్రి మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

జిల్లా టాపర్లకు డీఈవో అభినందన


సత్యధనస్వాతిని సత్కరిస్తున్న డీఈఓ వెంకటలక్ష్మమ్మ

పాయకరావుపేట, ఏప్రిల్ 23 : ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో జిల్లాలోని జడ్పీ ఉన్నత పాఠశాలల్లో టాపర్లుగా నిలిచిన పాయకరావుపేటకు చెందిన కోటిపల్లి సత్య ధనస్వాతి, గట్టెం శ్రీలేఖలను మంగళవారం జిల్లా విద్యాశాఖాధికారిణి వెంకటలక్ష్మమ్మ ఘనంగా సత్కరించారు. సందర్భంగా డీఈఓ మంగళవారం విద్యార్థినులను తన కార్యాలయానికి రప్పించుకుని ఘనంగా సత్కరించారని, అదేవిధంగా ఆయా పాఠశాలల హెచ్ఎంల డీఎస్.భవానీ, జి.రామారావు, ఉపాధ్యాయులకు అభినందనలు తెలియజేశారని ఎంఈవో కేవీఎన్.గాంధీ తెలిపారు. కాగా పట్టణంలో ఏర్పాటుచేసిన అభినందన కార్యక్రమంలో కోటిపల్లి సత్య ధనస్వాతిని పాయకరావుపేట వైస్ ఎంపీపీ ధనిశెట్టి మాధవి, జగతా శ్రీను, ధనిశెట్టి బుజ్జి ఘనంగా సత్కరించారు.

జనసేన తరపున రవికుమార్ నామినేషన్

ఎలమంచిలి, ఏప్రిల్ 23: ఎలమంచిలి నియోజకవర్గ అసెంబ్లీ స్థానానికి జనసేన పార్టీ తరపున సుందరపు రవికుమార్ మంగళవారం నామినేషన్ దాఖలు చేశారు. ఈ మేరకు నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి మనోరమకు అందజేశారు.

కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి తనకాల నామినేషన్

ఎలమంచిలి, ఏప్రిల్ 23: కాంగ్రెస్ పార్టీ ఎలమంచిలి అసెంబ్లీ అభ్యర్థి తనకాల అనంత రామ నరసింగరావు మంగళవారం నామినేషన్ వేశారు. అభిమానులు, పార్టీ శ్రేణులతో అచ్యుతాపురం నుంచి ర్యాలీగా వచ్చి రిటర్నింగ్ అధికారి మనోరమకు నామినేషన్ పత్రాలు అందజేశారు. ఆయన వెంట ఎంపీ అభ్యర్థి వేగి వెంకటేష్, డీసీసీ అధ్యక్షుడు బొడ్డు శ్రీను, జిల్లా సెక్రటరీ రావి రామసత్యం ఉన్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రామనరసింగరావు మాట్లాడుతూ.. తన విజయానికి అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పెదపూడి రాము, పట్టణ అధ్యక్షుడు వీసం రాంబాబు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధి కూలీ మృతి



ఎస్.రాయవరం, ఏప్రిల్ 23: జాతీయ ఉపాధి హామీ పనులకు వెళ్లి తిరిగి ఇంటికి వెళుతున్న ఉపాధి కూలి మృతి చెందిన ఘటన ఎస్. రాయవరంలో చోటుచేసుకొంది. ఇందుకు సంబంధించి ఎంపీడీవో సత్యనారాయణమూర్తి అందించిన వివరాలిలా ఉన్నాయి. ఎస్. రాయవరం దళిత కాలనీకి చెందిన ఎలుచూరి అమ్మాజి (56) పేటసూదిపురం చెరువులో ఉపాధి పనికి వెళ్లింది. పని ముగించుకొని అమ్మాజి తిరిగి ఇంటికి వస్తుండగా ఇంటి సమీపంలోకి వచ్చేసరికి ఒక్కసారిగా రోడ్డుపై కుప్పకూలి మృతి చెందింది. విషయం తెసుకున్న ఎంపీడీవో సత్యనారాయణమూర్తి వెంటనే సర్వసిద్ధి పీహెచ్‌సీకి, తహసీల్దార్, పోలీసులకు సమాచారం అందించారు. అంతేకాకుండా ఎంపీడీవో సత్యనారాయణమూర్తి, ఏపీవో సత్యవతి, సర్వసిద్ధి పీహెచ్‌సీ వైద్యురాలు సత్యప్రియతో కలిసి దళిత కాలనీకు వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతోనే వడదెబ్బ తగిలి అమ్మాజి మృతి చెంది ఉంటుందని పలువురు అనుమానం వ్యక్తం చేశారు.

ఎన్నికల నియమావళి అమలు అందరి బాధ్యత

»ఎంసీసీ నోడల్ అధికారి ప్రసాద్

అనకాపల్లి కలెక్టరేట్, ఏప్రిల్ 23: ఎన్నికల నియమావళి అమలుకు ప్రజలు కూడా సహకరించాలని ఎంసీసీ నోడల్ అధికారి బి.ప్రసాద్ కోరారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియమావళి అమలుకు ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్‌లను ఏర్పాటు చేసి, నిఘా పెట్టామన్నారు. ఎక్కడైనా నియమావళి ఉల్లంఘనలు జరుగుతున్నట్టు తెలిసిన వెంటనే జిల్లా కంట్రోల్ రూమ్‌కు తెలియజేయాలన్నారు. నిషిద్ధ ప్రాంతాలైన ప్రార్థనా స్థలాలలో, కులాలు, మతాల వారీగా సమావేశాలు నిర్వహించడం, కానుకలు అందజేయడం, విలువైన ఆభరణాలు, ఉపకరణాలు పంచడం, ప్రలోభాలు, ఆకర్షణలకు గురిచేయడం వంటి చర్యలు ఎవరైనా చేపట్టినా వెంటనే తెలపాలన్నారు. అనుమతి లేని బ్యానర్లు, హోర్డింగ్‌లు, కరపత్రాలు, గోడపత్రికలు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం నిషేధమన్నారు. ఎవరైనా ఉల్లంఘిస్తే కంట్రోల్ రూమ్ 08924 226599 నంబరుకు తెలియజేయాలన్నారు.

CLASSIFIEDS

CHANGE OF NAME

★ I, KATTA SANGEETHA (Old Name), W/o. Katta Avinash Babu, R/o. 6-138-1/6, Sri Madhuri Nivas, MSR Layout, Madhurawada, VSP-48. Changing my name from KATTA SANGEETHA (Old Name) to KATTA KRISHNA SANGEETA (New Name). Henceforth I am being called as KATTA KRISHNA SANGEETA (New Name), W/o. Katta Avinash for all purposes.

AJV_182885

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

For Advertisement Contact : 9963231176 9966165093

'అధిక నగదు, విలువైన వస్తువులతో ప్రయాణాలొద్దు'

అనకాపల్లి కలెక్టరేట్, ఏప్రిల్ 23: జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున అధిక మొత్తంలో నగదు, విలువైన ఆభరణాలు, వస్తువులతో ప్రయాణాలు చేయవద్దని గ్రీవెన్స్ కమిటీ కన్వీనర్ ఎల్‌డీఎం. సత్యనారాయణ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ టీమ్‌లతో సీజ్ చేయబడిన ఏ పార్టీకి చెందని ప్రజలు తమ అవసర నిమిత్తం తీసుకువెళుతున్న నగదు, వస్తువులు తగిన ఆధారాలతో ఎఫ్ఐఆర్ నమోదు కాబడని కేసులు మాత్రమే ఈ కమిటీ విచారణ చేస్తుందన్నారు. ప్రజలు ఈ విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

జనసేనలో పలువురి చేరిక


జనసేనలో చేరిన వారితో పంచకర్ల రమేశ్‌బాబు

సబ్బవరం, ఏప్రిల్ 23: మండల కేంద్రంలో పలువురు వైసీపీ నాయకులు, వారి అనుచరులు మంగళవారం పెందుర్తి జనసేన అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబు సమక్షంలో జనసేన పార్టీలో చేరారు. వారికి పంచకర్ల కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో యాత సంఘం నాయకులు, సబ్బవరం 2వ వార్డు మెంబరు తాటిపాములు శేఖర్, దళిత నాయకులు జి.ప్రభాకర్, మండల శ్రీను, అనుచరులు, తీడ రవి, అనుచరులు ఉన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు సాలాపు వెంకటేశ్వరరావు, బీఏ రావు, బంటికోళ్ల పద్మ, కర్రి నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

ఎరుకునాయుడుపాలెం సర్పంచ్ జనసేనలో చేరిక

మండలంలోని ఎరుకునాయుడుపాలెంలో మంగళవారం వైసీపీకి చెందిన సర్పంచ్ కర్రి నరసింగరావు, తనుబుద్ది కనకరాజు ఆధ్వర్యంలో పలు కుటుంబాలు జనసేనలో చేరారు. వారందరికీ జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబు సోదరుడు వెంకటేశ్వరరావు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నేతలు ఇందలి వెంకటరమణ, కర్రి కనకరాజు, బీఏ రావు, సాలాపు వెంకటేశ్వరరావు, శరగడం రాము, బోకం స్వామినాయుడు పాల్గొన్నారు.

మండల టాపర్ రిషితకు అభినందన

కోటవురట్ల, ఏప్రిల్ 23: పదో తరగతి పరీక్షల్లో మండల టాపర్‌గా నిలిచి స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థిని యల్లప రిషితను డిప్యూటీ డీఈవో అప్పారావు, పాఠశాల హెచ్ఎం, సిబ్బంది అభినందించారు. మంగళవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఈ పాఠశాలలో 97 శాతం ఫలితాలు రావడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. పాఠశాలలో 572 మార్కులు రిషిత సాధించగా.. 566 మార్కులతో ఉప్పు రజిత రెండో స్థానంలో ఉందని అప్పారావు తెలిపారు.

ఘనంగా గూడుపమ్మతల్లి జాతర

నక్కపల్లి, ఏప్రిల్ 23: మండలంలోని రేబాకలో ప్రతి రెండేళ్లకోసారి జరిగే గూడుపమ్మతల్లి అమ్మవారి జాతర మంగళవారం ఘనంగా జరిగింది. మండలంలోని మెరక గ్రామాల నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారిని మహిళలు పసుపు,కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పలు పార్టీల నాయకులు అమ్మవారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్నప్రసాదాలు పంపిణీ చేశారు.

పది విద్యార్థులకు గెడ్డం బుజ్జి అభినందనలు

పాయకరావుపేట రూరల్, ఏప్రిల్ 23: పదో తరగతి పరీక్షలలో ప్రతిభ కనబరిచిన గుంటపల్లి జడ్పీ హైస్కూల్ విద్యార్థులను జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి గెడ్డం బుజ్జి మంగళవారం అభినందించారు. ఈ హైస్కూల్ విద్యార్థిని గట్టెం శ్రీలేఖ 591 మార్కులు సాధించి, మండలంలో ప్రభుత్వ పాఠశాలలో ద్వితీయ స్థానం సాధించిన సంగతి తెలిసిందే. అదేవిధంగా కక్కుల శర్మిళ 552, గుడ్డాటి సిరిమేఘన వల్లీ 549, గట్టెం లోకేశ్ 549 మార్కులు సాధించారు. వీరందరిని మంగళవారం గెడ్డం బుజ్జి అభినందించారు.

విజయకుమార్‌కు ఘన స్వాగతం

అచ్యుతాపురం రూరల్, ఏప్రిల్ 23 :మండలంలోని చీమలాపల్లిలో జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి సుందరపు విజయ్‌కుమార్‌కు మంగళవారం ఘనస్వాగతం లభించింది. జనసైనికులు ఆయనను పూలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గ్రామంలో పారిపిల్లి అమ్మవారికి ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్థులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకుని వెళ్లారు. ఎమ్మెల్యేగా తనను గెలిపిస్తే గ్రామాన్ని అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు.

ఇంటర్ ఫెయిలైన వారికి నేటి వరకూ ఫీజు గడువు


నక్కపల్లి, ఏప్రిల్ 23: ఇంటర్మీడియట్ ఫెయిలైన విద్యార్థులు ఈ నెల 24వ తేదీ నాటికి పరీక్ష ఫీజు చెల్లించాలని నక్కపల్లి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీదేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష ఫెయిలైన విద్యార్థులతోపాటు, ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం బెటర్‌మెంట్ రాయాలనుకునే విద్యార్థులు బుధవారంలోపు నక్కపల్లి జూనియర్ కళాశాలలో ఫీజు చెల్లించాలని ప్రిన్సిపాల్ తెలిపారు.


98 మద్యం బాటిళ్లతో ఒకరు అరెస్టు

ఎస్.రాయవరం, ఏప్రిల్ 23: మండలంలోని తిమ్మాపురం శివారు కోనవానిపాలెం వద్ద జాతీయ రహదారి పక్కనే ఉన్న పాన్‌షాపులో మంగళవారం సాయంత్రం దాడి చేసి 98 మద్యం బాటిళ్లను పట్టుకున్నట్టు జిల్లా ఫ్లయింగ్ స్క్వాడ్ సీఐ సూర్యకుమారి తెలిపారు. పట్టుకున్న మద్యం విలువ రూ.17,010 ఉంటుందన్నారు. ఈ సందర్భంగా వీరబాబు అనే వ్యక్తిని అరెస్టు చేసినట్టు చెప్పారు. ముందస్తుగా అందిన సమాచారం మేరకు పాన్‌షాపుపై దాడి చేశామన్నారు. ఈ దాడిలో జిల్లా ఫ్లయింగ్ స్క్వాడ్ టీం జీఎస్‌టీ ఆఫీసర్ ప్రసాదరావు, ఎస్ఐ నాగకార్తీక్, హెచ్‌సీ మహేష్, కానిస్టేబుల్ రమణ పాల్గొన్నారని సీఐ సూర్యకుమారి చెప్పారు.

కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రారంభం

ఎలమంచిలి, ఏప్రిల్ 23: పట్టణంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని డీసీసీ అధ్యక్షుడు బొడ్డు శ్రీను, అసెంబ్లీ అభ్యర్థి తనకాల అనంత రామ నరసింగరావు మంగళవారం ప్రారంభించారు. అనంతరం తనకాలకు బీ.ఫారంను బొడ్డు శ్రీను అందజేశారు. తర్వాత కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలు తనకాల దంపతులను పుష్పగుచ్ఛాలతో అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జనరల్ సెక్రటరీ రావి రామసత్యం, నేతలు పెదపూడి రాము, రాహుల్, రాంబాబు పాల్గొన్నారు.





నేడు అనకాపల్లిలో ట్రాఫిక్ మళ్లింపు

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 23: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో బుధవారం జరిగే బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం నామినేషన్, కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పర్యటనలతో పట్టణంలో ట్రాఫిక్‌ను పోలీసులు మళ్లించనున్నారు. అభ్యర్థులు నామినేషన్లు వేసే సందర్భంగా ఉదయం అనకాపల్లి పీటీడీ కాంప్లెక్స్ నుంచి చోడవరం వైపు వెళ్లే బస్సులను రింగురోడ్డు, లక్ష్మీదేవిపేట గేటు, గుండాల మీదుగా రాకపోకలు సాగించేలా చర్యలు తీసుకుంటున్నామని ట్రాఫిక్ సీఐ పి. పైడపునాయుడు తెలిపారు. మధ్యాహ్నం మూడు గంటల నుంచి విశాఖపట్నం వైపు నుంచి అనకాపల్లి పట్టణంలోకి వచ్చే ఆర్టీసీ బస్సులను జాతీయ రహదారి, పూడిమడకరోడ్డు జంక్షన్ మీదుగా ఆర్టీసీ కాంప్లెక్స్‌కు చేరుకునేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అలాగే విశాఖ, విజయనగరం వెళ్లే బస్సులు కూడా జాతీయ రహదారి మీదుగా వెళతాయన్నారు. విజయనగరం వెళ్లే బస్సులు డైట్ కాలేజి జంక్షన్ నుంచి జలగలమదుం, సుంకరమెట్ట జంక్షన్ మీదుగా సబ్బవరం రోడ్డులోకి వెళతాయన్నారు. చోడవరం వైపు వచ్చి వెళ్లే బస్సులు కూడా గుండాల జంక్షన్ మీదుగా విజయరామరాజుపేట అండర్‌బ్రిడ్జి, నాయుళ్ల వీధి, రింగురోడ్డు మీదుగా రాకపోకలు సాగించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. చోడవరం మార్గం వైపు నుంచి వచ్చి వెళ్లే భారీ వాహనాలు తుమ్మపాలలో ఏలేరు కాలువ మీదుగా మళ్లిస్తున్నామన్నారు. కశింకోట వైపు నుంచి వచ్చే వాహనాలు జాతీయ రహదారి మీదుగా పూడిమడక జంక్షన్ నుంచి పట్టణంలోకి వచ్చే విధంగా చర్యలు తీసుకుంటున్నామని సీఐ పైడపునాయుడు తెలిపారు.

చంద్రబాబు, పవన్ దోస్తీతో వైసీపీలో వణుకు

జనసేన పెందుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబు


పంచకర్ల రమేశ్‌బాబును సత్కరించిన దాట్ల మధు

పెందుర్తి, ఏప్రిల్ 23: చంద్రబాబు, పవన్‌కల్యాణ్ దోస్తీతో వైసీపీకి వణుకు పుడుతుందని జనసేన పార్టీ పెందుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. సుజాతనగర్‌లోని దాట్ల మాన్షన్‌లో మంగళవారం టీడీపీ సీనియర్ నేత దాట్ల మధు ఆధ్వర్యంలో 95వ వార్డు టీడీపీ,జనసేన నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పంచకర్ల మాట్లాడుతూ నియోజకవర్గ ఓటర్లు విజ్ఞులని, వైసీపీ అరాచకాలను ముందుగానే గ్రహించి ఇక్కడ ఐదుగురు టీడీపీ కార్పొరేటర్లను గెలిపించారన్నారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లోనూ అదే సీన్ రిపీట్ అవుతుందన్నారు.ఎమ్మెల్యేగా తనను, అనకాపల్లి ఎంపీగా సీఎం రమేశ్‌ను గెలిపించాలని కోరారు. అనంతరం పంచకర్లను దాట్ల మధు సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బండారు అప్పలనాయుడు, సీఎం రమేశ్ సోదరుడు శ్రీనివాసుల నాయుడు, కార్పొరేటర్ సేనాపతి శంకరరావు, నాయకులు ఎ.సింహాచలం, జి.వెంకటరమణ, తాతారావు,రామునాయుడు, తదితరులు పాల్గొన్నారు. కాగా మండలంలోని గుర్రమ్మపాలెం, అక్కిరెడ్డిపాలెంలలో పంచకర్ల ప్రచారం సాగించారు. ఇంటింటికీ వెళ్లి గాజుగ్లాసు గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు.

పతుల కోసం సతీమణుల ప్రచారం

పెందుర్తి ఎమ్మెల్యేగా పంచకర్ల రమేశ్‌బాబును, అనకాపల్లి ఎంపీగా సీఎం రమేశ్‌ను గెలిపించాలని కోరుతూ వారి సతీమణులు మహాలక్ష్మి, శ్రీదేవి ప్రచారం సాగిస్తున్నారు. ఈ క్రమంలో కార్పొరేటర్ సేనాపతి వసంత, మాజీ ఎంపీపీ రెడ్డి వరలక్ష్మి, జనసేన వీరమహిళలతో కలిసి చినముషిడివాడ, సుజాతనగర్, రాంపురంలలో ప్రచారం చేశారు, కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వస్తే అన్ని వర్గాల వారికి మేలు చేకూరుతుందని వారన్నారు.

మరిడమ్మా.. చల్లంగ చూడమ్మా..

▸ పట్టణంలో ఘనంగా అమ్మవారి పండగ ▸ ఎటుచూసినా భక్తజన సందోహం



భక్తుల పూజలందుకున్న అమ్మవారు



ఎన్టీఆర్ మినీ స్టేడియంలో స్టేజీ ప్రోగ్రామ్‌ను వీక్షించేందుకు హాజరైన జనం



ఆకట్టుకున్న కాళీమాతా వేషధారణ

నర్సీపట్నం, ఏప్రిల్ 23 : పట్టణంలో మరిడి మహాలక్ష్మి అమ్మవారి పండగ అత్యంత వైభవోపేతంగా జరిగింది. సోమవారం రాత్రి నుంచి మంగళవారం రాత్రి వరకు ఎటుచూసినా జనసందడే కనిపించింది. ఆలయంలో అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. రెండేళ్లకు ఒకసారి జరిగే ఈ వేడుకను తిలకించేందుకు నర్సీపట్నం, చుట్టు పక్కల ప్రాంతాల వారితోపాటు ఎక్కడెక్కడో ఉద్యోగ, వ్యాపారాల రీత్యా స్థిరపడిన పట్టణ వాసులు, వారి బంధువర్గం, స్నేహితులు తరలి రావడంతో ప్రతి ఇల్లు సందడిగా కనిపించింది. అమ్మవారి దర్శనం కోసం మంగళవారం మండుటెండను సైతం భక్తులు లెక్కచేయక క్యూలో వేచి ఉన్నారు. మట్టి పిడతలో పప్పు అన్నం నైవేద్యంగా సమర్పించారు. పసుపు కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పట్టణానికి చెందిన రెల్లి కులస్తులు ప్రత్యేక వేషధారణతో పూలబాణాలు ధరించి జాతరకు విచ్చేశారు. డప్పువాయిద్యాలు, నేలడ్యాన్స్‌లు వేడుకకు వన్నెతెచ్చాయి. భారీ బాణా సంచా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

చినపాచిలలో ఘనంగా పెద్ద రాయి పండగ

▸ మహిళలు బిందెలతో పసుపు నీళ్లు తెచ్చి పూజలు



పసుపు నీళ్ల బిందెలతో వేపచెట్టు చుట్టూ మహిళలు ప్రదక్షిణలు



పెద్దరాయికి పూజలు

రావికమతం, ఏప్రిల్ 23 : మండలంలోని చినపాచిలలో పెద్ద రాయి పండగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ గ్రామంలో సానుబిల్లి వారి పూర్వీకులైన గ్రామ పెద్ద నల్లప్ప నాయుడు కలలో ఓ దేవతామూర్తి కనిపించి నాగుల కొండ వద్ద ఓ పెద్దరాయి ఉందని, అది మహర్షులు తపస్సు చేసిన ఎంతో మహిమగల రాయిని, దానిని గ్రామానికి తీసుకు వచ్చి వేప చెట్టువద్ద ఉంచి, ఆరాయిపై కూర్చొని తగాదాలు, సమస్యలపై తీర్పు చేబితే పరిష్కారం జరుగుతుందని చెప్పి అదృశ్యమైనట్టు పూర్వీకుల కథనం. దీంతో గ్రామ పెద్దయిన సానుబిల్లి నల్లప్పనాయుడు, సోములు తదితరులు ఆ మాట ప్రకారం మరుసటి రోజే గ్రామానికి కొంత దూరంలో ఉన్న నాగుల కొండ వద్దకు వెళ్లి చూడగా ఎవరూ కదపలేనంత పెద్దరాయి ఉంది. దీంతో గ్రామస్థులు కొంత మంది ఏకమై ఆ రాయికి పూజలు చేసి, రోజుకు కొంత దూరం చొప్పున కదుపుతూ మూడు నెలలకు గ్రామానికి తీసుకొచ్చి వేప చెట్టువద్ద ప్రత్యేక పూజల అనంతరం ఉంచారు. సుమారు రెండు వందల ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన ఈ పెద్దరాయి వద్ద ఏటా ఇక్కడున్న కోదండ సీతారాముల కల్యాణం నిర్వహించిన ఐదో రోజున చైత్ర పౌర్ణమి నాడు పండగను జరుపుతుంటారు. గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి ఒక బిందె పసుపు నీళ్లు తెచ్చి అక్కడి వేప చెట్టువద్ద పోస్తారు. ఈ వేడుకలో భాగంగా మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటైంది.

మోదకొండమ్మకు విశేష పూజలు



మాడుగుల, ఏప్రిల్ 23 : మండల కేంద్రం మాడుగులలో మంగళవారం మోదకొండమ్మకు విశేష పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి దర్శించుకున్నారు. తొలుత అర్చకులు అమ్మవారికి విశేష అలంకరణలు చేపట్టారు. కొందరు ఘటాలను ఊరేగింపుగా తీసుకువచ్చి సమర్పించారు. కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పదో తరగతి ఫలితాల్లో టాపర్లకు అభినందన

నర్సీపట్నం/నర్సీపట్నం అర్బన్/ గొలుగొండ/నాతవరం, ఏప్రిల్ 23 : పదో తరగతి పరీక్షల్లో తెలుగు మీడియంలో 576 మార్కులతో జిల్లా టాపర్‌గా నిలిచిన మండలంలోని చెట్టుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని బంటు పల్లవిని ఆర్డీవో జయరాం మంగళవారం ఇక్కడ అభినందించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం పిట్టా రామకృష్ణ, సైన్స్ ఉపాధ్యాయుడు ఏవీ రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు. అలాగే, పది ఫలితాల్లో నర్సీపట్నం మండలంలో టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు ఎంఈవో తలుపులు నగదు పురస్కారాలను అందజేశారు. ఇక్కడి జడ్పీ బాలికోన్నత పాఠశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పదో తరగతి ఫలితాలలో మండలంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచిన కోనా భవితేష్ (594), వంటాకుల వైశాలి దేవి (587), అడిగర్ల హేమ లక్ష్మణ కుమారి(586)లను అభినందించి నగదు పురస్కారాలను అందించారు. హెచ్‌ఎం మాధవి, సీఆర్‌ఎంటీలు పూడి వెంకటరమణ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. అదేవిధంగా టెన్త్‌లో టాపర్‌గా నిలిచిన గొలుగొండ మండలం చీడిగుమ్మల హైస్కూల్ విద్యార్థిని కామిరెడ్డి కావ్యను మంగళవారం పాఠశాలలో అభినందించారు. ఈమె పరీక్షల్లో 573 మార్కులు పొందింది. అలాగే, జోగంపేట హైస్కూల్లో కౌశిక్ 565 మార్కులు సాధించడంతో ఎంఈవో సత్యనారాయణ, చీడిగుమ్మల హైస్కూల్ హెచ్‌ఎం ఆనందరావు, ఉపాధ్యాయులు అభినందించారు. అదేవిధంగా నాతవరం మండలంలో టాపర్లుగా నిలిచిన విద్యార్థులను ఎంపీడీవో జె.రాంబాబు, ఎంఈవో అమృతకుమార్ అభినందించారు. నాతవరం హైస్కూల్‌లో చదివి టాపర్లుగా నిలిచిన గొంప రోహిత 567, యామని 555, డి.యర్రవరం హైస్కూల్ విద్యార్థి యశ్వంత్ 554 తదితరులను సత్కరించారు.నాతవరం హైస్కూల్ హెచ్‌ఎం శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న బృందంపై దొంగల దాడి

▸ స్వామివారి ఉంగరం అపహరణ

▸ భక్తి తత్వాన్ని చాటిన మృగయోత్సవం (దొంగల దోపు)



నీలుడుగా (దొంగ) సీతారామాచార్యుల బృందం

సింహాచలం, ఏప్రిల్ 23 : వరాహ లక్ష్మీనృసింహస్వామి వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి నిర్వహించిన మృగయోత్సవం (దొంగల దోపు) వేడుక భక్తితత్వాన్ని చాటింది. కల్యాణోత్సవాన్ని పురస్కరించుకుని స్వామి వారు తన దేవేరులతో, మంది మార్బలంతో కలిసి రాత్రి వేళ అడవికి వేటకు బయలుదేరి వెళ్లాడు. ఆ సమయంలో నీలుడు అనే చోరుడు దారి కాచి ఆ మార్గం గుండా వెళ్లే వారందరిని దోచుకునే క్రమంలో స్వామివారి బృందాన్ని కూడా అటకాయించి నగలు అపహరిస్తాడు, అదే క్రమంలో స్వామి వేలికి ఉన్న ఉంగరాన్ని అపహరిస్తాడు. ఈ ఉదంతాన్ని ఆలయ అర్చకులు వేడుకగా నిర్వహించారు. రాత్రి ఆరాధన అనంతరం మృగయోత్సవం (దొంగలదోపు) వైభవంగా జరిపారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని స్వర్ణాభరణాలతో అలంకరించి అశ్వవాహనం మీద, మరో పల్లకిలో తిరుమంగై ఆళ్వార్ (నీలుడు)ను, అమ్మవార్లను ఇంకొక పల్లకిలో ఉంచి సింహగిరి ప్రధాన మాడవీధుల మార్గంలోకి తీసుకువచ్చారు. మార్గమధ్యలో నీలుడు (చోరుడు)గా ఆలయ పురోహితుడు కరి సీతారామాచార్యులు నటించి హడావిడి చేసిన తీర ఆకట్టుకుంది. ఈ సందర్భంలో నీలుడు విగ్రహానికి స్వామి శరసంధానం చేసినట్టు భావించి విగ్రహ మెడను ఒరిగినట్టు చేయడం ఉత్సవంలో విశేషం. ఉత్సవంలో అర్చక స్వాములతో పాటు సింహగిరిపై నివశించే పలువురు గిరిజన యువత పాల్గొన్నారు. ఉత్సవం అనంతరం అంతరాలయంలో స్వామి వారికి పవళింపు సేవ మంగళాశాసనములు జరిపి కావాట బంధనంతో ఆరవ రోజు కార్యక్రమాలు ముగిసాయి. ఉత్సవాన్ని స్థానాచార్యులు రాజగోపాల్ నడిపించగా, ఏర్పాట్లను ఈఓ శ్రీనివాసమూర్తి ఆదేశాల మేరకు ఆలయ ఏఈఓ, పర్యవేక్షణాధికారులు చేశారు. ఈ ఉత్సవానికి కొనసాగింపుగా బుధవారం ఉదయం 8 గంటలకు వినోదోత్సవం పేరుతో ఉంగారాన్ని వెతుక్కునే వేడుక నిర్వహించనున్నారు.

టీడీపీలో పలువురు చేరిక



పార్టీలో చేరిన వారితో టీడీపీ, జనసేన నాయకులు

బుచ్చెయ్యపేట, ఏప్రిల్ 23 : తెలుగుదేశం పార్టీలో చేరికలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా వైసీపీకి చెందిన బుచ్చెయ్యపేట ఎంపీటీసీ సభ్యుడు సూరిశెట్టి వెంకటరావు, రాజాం ఎంపీటీసీ సభ్యురాలు మరిసా నాగమణి తమ అనుయాయులతో కలిసి మంగళవారం ఇక్కడ టీడీపీలో చేరారు. మాజీ ఎమ్మెల్యే కేఎస్‌ఎన్‌ఎస్ రాజు వీరికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం జనసేన, టీడీపీ నాయకులు పీవీఎస్‌ఎన్ రాజు, గునూరు మల్లునాయుడు, గేదెల సత్యనారాయణ, గోకివాడ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రావికమతం : తట్టబంద ఎంపీటీసీ పిల్లా శేషబాబు తన అనుచరులతో కలిసి మంగళవారం వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వీరికి చోడవరం ఉమ్మడి అభ్యర్థి రాజు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జనసేన, బీజేపీ నాయకులు పీవీఎస్‌ఎన్ రాజు, ఈర్లె శ్రీరామమూర్తి, టీడీపీ రావికమతం, బుచ్చియ్యపేట మండలాల అధ్యక్షులు రాజాన కొండనాయుడు, గోకివాడ కోటేశ్వరరావు, తట్టబంద సర్పంచ్ గోకివాడ రమణ తదితరులు పాల్గొన్నారు.

‘కూటమి అభ్యర్థుల గెలుపుతోనే జిల్లా అభివృద్ధి’



పి.భీమవరంలో మాట్లాడుతున్న శ్రీదేవి

బుచ్చెయ్యపేట, ఏప్రిల్ 23 : ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల గెలుపుతేనే జిల్లా అభివృద్ధి సాధ్యమని అనకాపల్లి పార్లమెంటు బీజేపీ అభ్యర్థి సీఎం రమేష్ సతీమణి శ్రీదేవి అన్నారు. మండలంలోని పి.భీమవరంలో ఆమె ఉపాధి కూలీలను కలిసి కూటమి అభ్యర్థులకు ఓటు వేయాలని కోరారు. బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి అనకాపల్లి ఎంపీగా పోటీచేస్తున్న సీఎం రమేష్, చోడవరం ఎమ్మెల్యే అభ్యర్థిగా కేఎస్‌ఎన్‌ఎస్ రాజులను అత్యధిక మెజార్టీతో గెలిపించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీఎం రమేష్ సోదరి మాధవి, బీజేపీ నాయకులు ఈర్లె శ్రీరామూర్తి, సీతా నాగరాజులతో పాటు పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న నామినేషన్ల పర్వం

నర్సీపట్నం, ఏప్రిల్ 23 : నర్సీపట్నం నియోజకవర్గం వైసీపీ అభ్యర్థిగా పెట్ల ఉమాశంకర్ గణేశ్ మంగళవారం రెండు సెట్లు నామినేషన్ పత్రాలను ఆర్వో జయరాంకు అందజేశారు. తొలుత పెదబొడ్డేపల్లిలోని నివాసం నుంచి ర్యాలీగా వచ్చి నామినేషన్ దాఖలు చేశారు. ఆయన వెంట ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు, చింతకాయల సన్యాసిపాత్రుడు తదితరులతో పాటు పార్టీ శ్రేణులు ఉన్నారు. అలాగే, డమ్మీ అభ్యర్థిగా గణేశ్ భార్య కవిత రెండు సెట్లు నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు.

చోడవరం కాంగ్రెస్ అభ్యర్థిగా జగతా...

చోడవరం : నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థిగా జగతా శ్రీనివాసరావు మంగళవారం నామినేషన్ దాఖలు చేశారు. రిటర్నింగ్ అధికారి ఏజీ చిన్నికృష్ణకు సదరు పత్రాన్ని అందజేశారు. పాయకరావుపేట కంటోన్మెంట్ వీధికి చెందిన ఈయన ప్రస్తుతం ఆ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జిగా కూడా కొనసాగుతున్నారు

నీలగిరి, జీడిమామిడి తోటలు దగ్ధం



వడ్డాదిలో నీలగిరి, కేఎంపురంలో జీడిమామిడి తోటల్లో చెలరేగుతున్న మంటలు

బుచ్చెయ్యపేట, ఏప్రిల్ 23: వడ్డాదిలో మంగళవారం మూడెకరాల నీలగిరితోట దగ్ధమైంది. ఈ ప్రమాదం కారణంగా సుమారు నాలుగు లక్షలు నష్టం జరిగినట్టు బాధితుడు బాబూరావు వాపోయారు. కాల్చిన సిగిరెట్టు విసిరేసిన కారణంగా ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చునని ఆయన అభిప్రాయపడ్డారు. మంటలు ఇతర ప్రాంతాలకు వ్యాపించకుండా రావికమతం అగ్నిమాపక సిబ్బంది వచ్చి అదుపుచేశారు.

రావికమతం : కొమిరమత్స్యపురంలో మంగళవారం రెండు ఎకరాల జీడిమామిడి తోటలు దగ్ధమయ్యాయి. గ్రామ సమీపంలో బుడ్డిబంద వెళ్లే రోడ్డును ఆనుకొని నక్కా అప్పలనాయుడు, నక్కా మహాలక్ష్మమ్మ, యండపల్లి నానాజీలకు చెందిన రెండు ఎకరాల జీడిమామిడి తోటలు ఉన్నాయి. అటుగా పోయే వారు కాల్చిన సిగిరెట్టును పారేయడంతో ఈ ఘటన జరిగి ఉంటుందని చెపుతున్నారు.

చంద్రబాబును కలిసిన తాతయ్యబాబు



చంద్రబాబునాయుడుతో తాతయ్యబాబు

బుచ్చెయ్యపేట, ఏప్రిల్ 23: టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు సోమవారం రాత్రి విజయనగరం జిల్లా శృంగవరపుకోటలో పార్టీ అధినేత చంద్రబాబునాయుడును మర్యాద పూర్వకంగా కలిశారు. తనను ఈ పదవికి నియమించినందుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో పార్టీ పరిస్థితి, ఎన్నికల ప్రచారం తదితరాలపై ఇరువురూ చర్చించారు.

కూటమి అభ్యర్థుల విజయానికి కృషి

▸ బ్రాహ్మణ కార్పొరేషన్ జిల్లా మాజీ సమన్వయకర్త ‘కొమ్మనమంచి’



కూటమి అభ్యర్థి రాజుతో నరసింహమూర్తి తదితరులు

చోడవరం, ఏప్రిల్ 23: జిల్లాలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థుల విజయానికి తమవంతు కృషి చేస్తామని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ కార్పొరేషన్ జిల్లా మాజీ సమన్వయకర్త, రాష్ట్రీయ బ్రాహ్మణ సంఘటన యువజన కార్యదర్శి కొమ్మనమంచి నరసింహమూర్తి ప్రకటించారు. మండలంలోని గవరవరానికి చెందిన యువకులతో కలిసి మంగళవారం ఆయన చోడవరం కూటమి అభ్యర్థి కేఎస్ ఎన్ఎస్ రాజును కలిసి మద్దతు ప్రకటించారు. రాష్ట్రంలో యువతకు ఉపాధి అవకాశాలు లభించాలంటే చంద్రబాబు వంటి సమర్థ నాయకుడు అవసరమన్నారు. అందువల్లే యువతరం అంతా చంద్రబాబు పాలన కోసం ఎదురు చూస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు యువకులు పాల్గొన్నారు.

సహకార సంఘ ఉద్యోగిపై ఆర్వోకు ఫిర్యాదు

మాకవరపాలెం, ఏప్రిల్ 23 : మండలంలోని తామరం కో-ఆపరేటివ్ సహకార సంఘంలో ఉద్యోగం చేస్తూ వైసీపీ ప్రచారంలో పాల్గొంటున్న గొంతిన ఆదియ్య (హరిబాబు)పై చర్యలు తీసుకోవాల్సిందిగా నియోజకవర్గ ఐటీడీపీ ఇన్‌చార్జి కోసూరు శ్రీనివాసరావు రిటర్నింగ్ ఆఫసర్ జయరాంకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ మంగళవారం ఎమ్మెల్యే గణేశ్ నామినేషన్ సందర్భంగా ఆదియ్య వైసీపీ కార్యకర్తలతో కలిసి ర్యాలీగా వెళ్లిన వీడియో క్లిప్పింగ్‌తో సహా ఆర్వోకు ఫిర్యాదు చేశారు. అలాగే గత నెల రోజులుగా తామరంలో సోషల్ మీడియాలో వైసీపీ పోస్టులు చేయంతో పాటు గ్రామంలో ఇటీవల జరిగిన వైసీపీ నాయకుల ఎన్నికల ప్రచారంలో కూడా సదరు ఉద్యోగి పాల్గొన్నారని ఆరోపించారు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న ఆదియ్యపై వెంటనే చర్యలు తీసుకోవాల్సిందిగా కోరినట్టు చెప్పారు.

‘వేసవిలో తరగతులు నిర్వహిస్తే చర్యలు’



గొల్లలపాలెం కేజీబీవీ విద్యార్థులు సిబ్బందితో ఎంఈవోలు

కె.కోటపాడు, ఏప్రిల్ 23 : వేసవి సెలవుల్లో ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో ఏ విధమైన తరగతులను నిర్వహించినా చర్యలు తప్పవని ఎంఈవోలు కె.సత్యనారాయణ, డీవీడీ స్పష్టం చేశారు. మండలంలోని గొల్లలపాలెం కేజీబీవీ పాఠశాలను మంగళవారం పరిశీలించారు. ఈ ఏడాది టెన్త్‌లో ఇక్కడ శతశాతం ఫలితాలు సాధించడంతో ప్రిన్సిపాల్, సిబ్బందిని అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతూ వేసవి సెలవుల్లో విద్యాశాఖ ప్రణాళిక ప్రకారం ఉపాధ్యాయులు నడుచుకోవాలన్నారు. వ్యాయామ ఉపాధ్యాయులతో సమ్మర్ క్యాంపులు ఏర్పాటు చేసి, విద్యార్థులను అన్ని రంగాల్లో తీర్చిదిద్దాలన్నారు. ఖాళీ సమయాల్లో విద్యార్థులు సమీపంలో ఉన్న గ్రంథాలయాలకు వెళ్లి పుస్తక పఠనం చేయాల్సిందిగా వారు సూచించారు.

ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో పుస్తక దినోత్సవం



వేడుకలో మాట్లాడుతున్న వైస్ ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్

చోడవరం, ఏప్రిల్ 23 : ఇక్కడి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంగ్లీషు, లైబ్రరీ విభాగాల ఆధ్వర్యంలో మంగళవారం అంతర్జాతీయ పుస్తక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ పుస్తక దినోత్సవం ప్రాముఖ్యతతో పాటు పుస్తక పఠనం వల్ల ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ డి. మాల్యాద్రి, అధ్యాపకులు ఎస్.మల్లిబాబు, రఫియుద్దీన్, అప్పలనాయుడు, రాధాకృష్ణ, వెంకటేశ్ పాల్గొన్నారు.

52 మందికి వైద్య పరీక్షలు

చీడికాడ, ఏప్రిల్ 23 : దండిసురవరం గ్రామంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పాల కేంద్రంలో జరిగిన ఈ శిబిరంలో 52మందికి పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. ఎంఎల్‌హెచ్‌పీ శంకర్, హెల్త్ అసిస్టెంట్ చినబాబు, ఏఎన్‌ఎం ఆశవర్కర్లు సేవలందించారు.

పాఠశాలల్లో ఇంగ్లీష్ దినోత్సవం

మాకవరపాలెం, ఏప్రిల్ 23 : తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాలలో ఇంగ్లీష్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు స్పెల్‌బీ పరీక్ష నిర్వహించగా, గొల్లు లోకేష్ ,తేజస్విని యాభై పదాలను ఎటువంటి తప్పులు లేకుండా రాశారు. దీంతో వీరికి ప్రధానోపాధ్యాయుడు కోసూరు రాము బహుమతులు అందజేశారు. అలాగే, కస్తూర్బా పాఠశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేకాధికారిణి త్రివేణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దిబ్బిడి జడ్పీ హైస్కూల్‌లో...

బుచ్చెయ్యపేట : దిబ్బిడి జడ్పీ హైస్కూల్‌లో మంగళవారం ఇంగ్లీషు లాంగ్వేజ్ డేను నిర్వహించారు. విలియం షేక్‌స్పియర్ చిత్రపటానికి ఉపాధ్యాయులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఇంగ్లీషు పట్ల ఆసక్తి పెంచడానికి విద్యార్థులు స్కిట్ల రూపంలో రోల్‌ప్లే చేశారు. హెచ్‌ఎం కె.సత్యారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టీడీపీకి విధేయుడిగానే ఉంటా : పైలా



కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న పైలా

దేవరాపల్లి, ఏప్రిల్ 23 : టీడీపీకి విధేయుడిగానే ఉంటానని ఆ పార్టీ నాయకుడు పైలా ప్రసాదరావు స్పష్టం చేశారు. ఇక్కడి కార్యాలయంలో మంగళవారం ఏర్పాటైన నియోజకవర్గ కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో మాట్లాడారు. పదిహేను సంవత్సరాలుగా పైలా ఫౌండేషన్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించినట్టు చెప్పారు. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఇచ్చిన మాట ప్రకారం మాడుగుల టికెట్టు ఇచ్చినప్పటికీ తప్పుడు ప్రచారం వల్ల వేరొకరికి బి-ఫారం ఇచ్చారన్నారు. కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానన్నారు. అయితే రెండురోజుల్లో కార్యకర్తల అభి ప్రాయం తెలుసుకుని నిర్ణయం ప్రకటిస్తానన్నారు. ఈ సమావేశంలో పాత్రిన సింహాచలంనాయుడు, కుచ్చు కళావతి, బొడ్డు అక్కునాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య

అనకాపల్లి టౌన్, ఏప్రిల్ 23: ఆర్థిక ఇబ్బందులు తాళలేక మంగళవారం తెల్లవారుజామున ఉరిపోసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటనపై అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పట్టణ ఎస్ఐ వి. సత్యనారాయణ తెలిపారు. ఆయన అందించిన వివరాలిలా ఉన్నాయి. తాకాశివీధికి ఆనుకుని ఉన్న కుమ్మరివీధికి చెందిన కొత్తూరు రమణబాబు (35) ఎన్టీఆర్ జంక్షన్ సమీపంలోని సెల్‌ఫోన్ దుకాణం నిర్వహిస్తున్నాడు. రోజు మాదిరిగానే సోమవారం రాత్రి ఇంటికి వెళ్లి నిద్రపోయాడు. మంగళవారం వేకువజామున మూడు గంటల సమయంలో నిద్ర నుంచి మేల్కొని సెల్‌ఫోన్‌తో సెల్ఫీ వీడియో తీశాడు. ఈ వీడియోలో తనకు చాలా అప్పులు ఉన్నాయని, వడ్డీలు కట్టలేకపోతున్నానని మనస్తాపంతో ఆత్మహత్య చేసుకుంటున్నట్టు సెల్ఫీ వీడియో తీసి భార్యకు, స్నేహితులకు పంపాడు. అనంతరం ఇంట్లోంచి బయటకు వచ్చి సమీపంలోని మహానందేశ్వర ఆలయం పిల్లర్‌కు నైలాన్‌తాడుతో ఉరిపోసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఉదయం గుడి వచ్చిన కె.శ్రీను అనే వ్యక్తి సంఘటనను చూసి కుటుంబసభ్యులకు తెలియపరిచారు. భార్య గంగాభవాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. సంఘటనా స్థలానికి పట్టణ సీఐ జి. శంకరరావు, క్లూస్ బృందం, డాగ్ స్క్వాడ్ వెళ్లి తనిఖీలు చేశారు. రమణబాబుకు భార్య కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఎన్టీఆర్ వైద్యాలయంలో మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించినట్టు ఎస్ఐ తెలిపారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

ఎలమంచిలి, ఏప్రిల్ 23: మండలంలోని రేగుపాలెం జంక్షన్ వద్ద హైవేపై రోడ్డు దాటుతున్న వ్యక్తిని లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందినట్టు రూరల్ ఎస్ఐ సింహాచలం తెలిపారు. మంగళవారం రాత్రి జరిగిన ఈ ప్రమాదంలో నాతవరం మండలం జిల్లేడిపూడి గ్రామానికి చెందిన ఐతి సత్తిబాబు మృతి చెందారన్నారు. అనకాపల్లి నుంచి తుని వైపు ప్రయాణిస్తున్న లారీ జంక్షన్ వద్ద సత్తిబాబు రోడ్డు దాటుతుండగా ఢీకొందన్నారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించామని, పూర్తి వివరాలు దర్యాప్తులో తెలియాల్సి ఉందని ఎస్ఐ సింహాచలం తెలిపారు.

షిప్‌యార్డులో కాంట్రాక్టు కార్మికుడు మృతి

మల్కాపురం, ఏప్రిల్ 23: షిప్‌యార్డులో ఓ కాంట్రాక్టు కార్మికుడు అకస్మాత్తుగా మృతి చెందాడు. మల్కాపురం పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక ప్రకాశనగర్ ఏడుగుళ్ల జంక్షన్ వద్ద మహంతి నరేశ్‌కుమార్ (53) కుమార్తె ప్రియాంక కుమారితో కలిసి నివాసం ఉంటున్నాడు. మంగళవారం ఆయన యథావిధిగా పనికి వెళ్లాడు. విధుల్లో భాగంగా నడిచి వెళ్తుండగా ఒక్కసారిగా కుప్పకూలి పడిపోయాడు. వెంటనే ఆయనను చికిత్స నిమిత్తం ఈఎస్ఐ ఆస్పత్రికి తీసుకువెళ్లగా అప్పటికే నరేశ్‌కుమార్ మృతి చెందినట్టు వైద్యుడు ధ్రువీకరించారు. ఈ మేరకు ఆయన మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. ప్రియాంక కుమారి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ANDHRA JYOTHI CLASSIFIEDS

CHANGE OF NAME

★ I, **KATTA SANGEETHA** (Old Name), W/o. Katta Avinash Babu, R/o. 6-138-1/6, Sri Madhuri Nivas, MSR Layout, Madhurawada, VSP-48. Changing my name from **KATTA SANGEETHA** (Old Name) to **KATTA KRISHNA SANGEETA** (New Name). Henceforth I am being called as **KATTA KRISHNA SANGEETA** (New Name), W/o. Katta Avinash for all purposes.

AJV_182885

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

For Advertisement Contact :
9963231176, 9966165093